TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : పోలగోని రాజేష్

Published from Hyderabad, Rangareddy, Nalgonda, Mahabubnagar, Khammam | సంపుటి : 2 | సంచిక : 90 | పేజీలు : 8 | బుధవారం 4 సెప్టెంబర్ 2024 | వెల : 4/-

రిపోర్టర్లు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రికకు రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తిగల, అనుభవం కలిగిన అభ్యర్థులు కావలెను..

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక నెట్వర్క్ ఇంచార్జ్

పి.వెంకటేష్

9949360937,9100900931

# ఆరువేల కోట్లనష్టం



- ప్రభుత్వం ప్రాథమిక అంచనా
- క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తే ఇది మరింత పెరిగే అవకాశం
- రెండు రోజుల వ్యవధిలోనే పంటలు నీట మునిగాయని వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు అభిప్రాయం
- ప్రస్తుతానికి ముందు ముంపు ప్రాంతాల ప్రజలకు సాయం చేయడంపైనే యంత్రాంగమంతా దృష్టి
- ప్రభుత్వం ప్రాథమిక అంచనాల ప్రకారం తెలంగాణలో వర్షలు, వరదల కారణంగా దాదాపు 20 మంది చనిపోయినట్టు గుర్తించింది.

**హైదరాబాద్**

లంగాణ వ్యాప్తంగా కురిసిన వర్షాలకు భారీ ఆస్తినష్టం జరిగినట్టు ప్రభుత్వం ప్రాథమికంగా అంచనా వేసింది. కేవలం రెండు రోజుల వ్యవధిలోనే పంటలు నీట మునిగాయని వేల కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు అధికారులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్తే ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతానికి ముందు ముంపు ప్రాంతాల ప్రజలకు సాయం చేయడంపైనే యంత్రాంగమంతా దృష్టి పెట్టింది. ఈ సహాయ కార్యక్రమాలు కొలిక్కి వచ్చిన తర్వాత మిగతా వాటిపై దృష్టి పెట్టనున్నారు. ప్రభుత్వం ప్రాథమిక అంచనాల ప్రకారం తెలంగాణలో వర్షలు, వరదల కారణంగా దాదాపు 20 మంది చనిపోయినట్టు గుర్తించింది. ఐదు వేల మందికిపైగా ప్రజలకు నిరాశ్రయులై పునరావాస కేంద్రాల్లో ఉంటున్నట్టు లెక్కకట్టింది. ఇంకా పలు ప్రాంతాలు వరద నీటిలో ఉన్నందున ఇంకా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మరికొందర్ని ఈ పునరావాసాలకు తరలిచే అవకాశం లేకపోలేదని అధికారులు అంటున్నారు. అదే టైంలో పంట నష్టం కూడా భారీగా జరిగినట్టు లెక్కగడుతున్నారు. మునిగి ప్రాంతాలను పరిశీలిస్తే దాదాపు ఆరువేల కోట్లు నష్టం వాటిల్లినట్టు అభిప్రాయపడుతున్నారు. మహబూబాబాద్, ఖమ్మం, వరంగల్, సూర్యపేట, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వానలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. రోడ్లను - మిగతా3లో



# వరద బాధితులకు కేంద్ర సాయం

- కిషన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు
- చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు
- ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుంది
- ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలి
- యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదు

# ప్రాణనష్టం తగ్గించగలిగాం

- తెలంగాణలో వర్షాలు, వరదలపై రేవంత్ రెడ్డి
- మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయిందని వెల్లడి
- మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామన్న సీఎం
- పంట నష్టం అంచనా వేసి పరిహారం చెల్లిస్తామన్న ముఖ్యమంత్రి
- తెలంగాణ అంతా హైడ్రా లాంటి వ్యవస్థ



**వరంగల్ :**

భారీ వర్షాలు, వరదలు వచ్చినప్పటికీ అధికారుల చర్యలతో ప్రాణనష్టం తగ్గించగలిగామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. జిల్లాల్లో వరదలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడు తూ... మహబూబాబాద్ జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదయిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించినట్లు తెలిపారు. పంట నష్టం అంచనా వేసి పరిహారం అందిస్తామన్నారు. నష్టపోయిన 3 తండాల వాసులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. ఖమ్మంలో ఆక్రమణల వల్లే భారీ వరదలు వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. మున్నేరు రిటైనింగ్ వాల్ ఎత్తు పెంపుపై ఇంజినీర్లతో చర్చిస్తామన్నారు. ఆక్రమణలను గుర్తించి తొలగిస్తామని స్పష్టం చేశారు. ఏడున్నర దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయిందన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి వరదలపై చేసిన సమీక్షలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. హైడ్రా తరహాలో ప్రతి జిల్లాలోనూ ఒక వ్యవస్థను కలెక్టర్లు ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశించారు. చెరువులను ఆక్రమించుకో వడం క్షమించరాని నేరం అని.. చెరువుల ఆక్రమణలపైన రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపడతామని రేవంత్ రెడ్డి చెప్పారు. ఆక్రమణలకు పాల్పడినది ఎంతటి వారైనా వదిలి పెట్టబోమని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. - మిగతా3లో

# వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్



- గత మూడు నాలుగు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి
- భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో తీవ్రమైన నష్టం జరిగింది
- వరదల విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది
- రేవంత్ రెడ్డి ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల, ప్రజలను అలర్ట్ చేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం పెద్ద ఎత్తున జరిగింది
- సీఎం రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ.. పనితనం తక్కువ : హరీశ్ రావు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

**ఖమ్మం**

ఖమ్మం జిల్లాలో వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గత మూడు నాలుగు రోజుల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. భారీ వర్షాలకు ఖమ్మం జిల్లాలో తీవ్రమైన నష్టం జరిగింది. సూర్యాపేట, ఖమ్మం, కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాల వల్ల జనజీవనం అతలాకులతమైంది. భారీగా ప్రాణ, ఆస్తి, పంట నష్టం జరిగింది. వరదల విషయంలో ప్రభుత్వం దారుణంగా విఫలమైంది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం సకాలంలో స్పందించకపోవడం వల్ల, ప్రజలను అలర్ట్ చేయకపోవడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం పెద్ద ఎత్తున జరిగిందన్నారు హరీశ్‌రావు. పార్టీ తరపున వరద బాధితులకు సహాయం అందించేందుకు సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, జగదీశ్ రెడ్డి, రవిచంద్ర, నామా నాగేశ్వర్ రావు, వివేకానంద గౌడ్, కౌశిక్ రెడ్డి, సంద్ర వెంకటవీరయ్య, శంభీపూర్ రాజు వచ్చాం. ప్రభుత్వం చేపడుతున్న వరద - మిగతా3లో



## రెండు తెలుగు రాష్ట్రాలకు బాలకృష్ణ భారీ విరాళం

- తెలుగు రాష్ట్రాలకు తీవ్ర నష్టం కలగజేసిన భారీ వర్షాలు
- బాధితులను ఆదుకునేందుకు ముందుకు వస్తున్న ఫిల్మ్ ఇండస్ట్రీ
- రెండు రాష్ట్రాలకు రూ. 50 లక్షల చొప్పున విరాళం ప్రకటించిన బాలయ్య

## ఔటర్ రింగ్ రోడ్డులోని 51 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తు ఆర్డినెన్స్

- రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాల విలీనం
- ఒక్కో మున్సిపాలిటీలో ఒకటి నుంచి ఆరు గ్రామాల విలీనం
- శంషాబాద్, పెద్దఅంబర్‌పేట సహా పలు మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనం



## విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు

- ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీకి కమిషన్ ఏర్పాటు
- చైర్మన్, ముగ్గురు సభ్యులతో విద్యా కమిషన్ ఏర్పాటు
- త్వరలో వీరిని నియమించనున్నట్లు వెల్లడి

# 8 రోజుల సీబీఐ కస్టడీకి ప్రొ. సందీప్ ఘోష్

**కోల్‌కతా, సెప్టెంబర్ 03:** కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో ఆర్థిక అవకతవకలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలపై అరెస్టయిన మాజీ ప్రిన్సిపల్ ప్రొ. సందీప్ ఘోష్‌కు కోర్టు 8 రోజుల సీబీఐ కస్టడీ విధించింది. ఈ మేరకు కోల్‌కతాలోని సీబీఐ ప్రత్యేక కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఇవే ఆరోపణలపై సోమవారం ప్రొ. సందీప్ ఘోష్‌ను సీబీఐ అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. ఆయనతోపాటు మరో ముగ్గురు.. బిప్లవ్ సింఘా, సుమన్ హజారా, అఫ్సర్ అలీ ఖాన్‌లను సైతం సీబీఐ అరెస్ట్ చేసింది. మంగళవారం ప్రత్యేక కోర్టులో వీరిని సీబీఐ ప్రవేశపెట్టింది. ఈ నేపథ్యంలో వారికి 8 రోజుల సీబీఐ కస్టడీ విధిస్తూ.. కోర్టు ఆదేశించింది. అనంతరం ఈ కేసును సెప్టెంబర్ 10వ తేదీకి సీబీఐ కోర్టు వాయిదా వేసింది. అయితే ఈ కేసులో విచారించేందుకు 10 రోజులపాటు వీరిని తమ కస్టడీకి అప్పగించాలని కోర్టును సీబీఐ అభ్యర్థించింది. కానీ కోర్టు మాత్రం కేవలం 8 రోజులు మాత్రమే వీరిని కస్టడీకి అప్పగిస్తూ ఆదేశించింది. ఇక కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలంటూ నలుగురిలో ఒకరైన అఫ్సర్ అలీ



ఖాన్ పెట్టుకున్న పిటిషన్‌ను కోర్టు ఈ సందర్భంగా తోసిపుచ్చింది. ఆగస్ట్ 9వ తేదీన కోల్‌కతాలోని ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం జరిగింది. ఈ ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ హత్యాచారం ఘటన జరిగిన కొన్ని గంటలకే కాలేజీ ప్రిన్సిపల్ పదవికి ప్రొ. సందీప్ ఘోష్ రాజీనామా చేశారు. అనంతరం ఎక్స్ వేదికగా ఈ హత్యాచార ఘటనపై స్పందిస్తూ.. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. మరోవైపు ఈ కాలేజీ ప్రిన్సిపాల్ పదవికి రాజీనామా చేసిన కొన్ని గంటలకే ప్రొ. సందీప్ ఘోష్‌కు మమతా బెనర్జీ ప్రభుత్వం మరో కీలక పదవిలో ఆయన్ని నియమిస్తూ ఆగమేఘాల మీద ఆదేశాలు జారీ చేసింది. ఇక ట్రైయినీ వైద్యురాలి హత్యాచార ఘటనపై విచారణ చేపట్టిన కోల్‌కతా హైకోర్టు.. ప్రొ. సందీప్ ఘోష్ సెలవుపై పంపాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇంకోవైపు ఆర్ జీ కర్ మెడికాల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ప్రొ. సందీప్ ఘోష్ ఆర్థిక అవకతవకలు పాల్పడ్డారంటూ సదరు కాలేజీ మాజీ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ అఖ్తర్ ఆలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీబీఐ ఈ చర్యలు తీసుకుంది. ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ట్రైయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసులో ప్రొ. సందీప్ ఘోష్‌ను వరుసగా 15 రోజుల పాటు సీబీఐ ప్రశ్నించింది. అనంతరం ఆయన ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డారన్న కేసులో సీబీఐ ఆయన్ని అరెస్ట్ చేసింది.

# ఎన్‌కౌంటర్‌లో 9 మంది మావోయిస్టులు మృతి

**ఛత్తీస్‌గఢ్ :** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తొమ్మిది మంది మావోయిస్టులు మృతి చెందారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో మావోయిస్టుల మృతదేహాలతోపాటు పలు ఆయుధాలను సైతం స్వాధీనం చేసుకున్నామని పోలీస్ ఉన్నతాధికారి వెల్లడించారు. వాటిలో 303 సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్‌తోపాటు 12 తుపాకులున్నాయని వివరించారు. బీజాపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దుల్లో భారీగా మావోయిస్టులు ఉన్నారంటూ మంగళవారం ఉదయం సమాచారం అందిందని తెలిపారు. దీంతో ఆ యా ప్రాంతాల్లో పోలీసులు కూబింగ్ చేపట్టారన్నారు. ఆ క్రమంలో మావోయిస్టులు.. పోలీసులపైకి కాల్పులకు తెగబడ్డారని చెప్పారు. ఆ వెంటనే పోలీసులు సైతం స్పందించి.. ఎదురు కాల్పులకు దిగారని పేర్కొంది. ఈ రెండు జిల్లాల సరిహద్దుల్లో పోలీసుల కూబింగ్ ఇంకా కొనసాగుతుందన్నారు. మరోవైపు దేశవ్యాప్తంగా మావోయిస్టులను నిర్మూలించే కార్యక్రమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా.. గత వారం ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అధ్యక్షతన మావోయిస్టులను అంతమొందించేందుకు కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయితోపాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన కీలక ఉన్నతాధికారులు హాజరయ్యారు. అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టులతో ప్రభుత్వం చేస్తున్న పోరాటం తుది దశకు చేరుకుందన్నారు. 2026, మార్చి మాసాంతానికి



దేశంలో మావోయిస్టులను రూపుమాపేందుకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందని వివరించారు. అలాగే మావోయిస్లుల లొంగుబాటుకు కేంద్రం ప్రత్యేక విధానాన్ని మరో రెండు నెలల్లో తీసుకు వస్తుందని తెలిపారు. ఇంకోవైపు అమిత్ షా సమావేశం జరిగిన 48 గంటల అనంతరం ఛత్తీస్‌గఢ్‌లో 25 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో అయిదుగురిపై రూ.28 లక్షల రివార్డు ఉంది. బీజాపూర్‌లో ఇప్పటి వరకు 176 మంది మావోయిస్టులు లొంగిపోయారు.

# రెండు తెలుగు రాష్ట్రాలకు బాలకృష్ణ భారీ విరాళం

భారీ వరదల కారణంగా ఇరు తెలుగు రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయాయి. ఈ నేపథ్యంలో వరద బాధితులను ఆదుకునేందుకు చిత్ర పరిశ్రమ ముందుకు వస్తోంది. ఇప్పటికే పలువురు సెలబ్రిటీలు విరాళాలను ప్రకటించారు. రెండు తెలుగు రాష్ట్రాలను వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత నాలుగు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ముఖ్యంగా ఏపీలోని విజయవాడ, తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లాలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. రంగంలోకి దిగిన అధికారులు వరద ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అనేక మంది ప్రజలు ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారు. ఈ క్రమంలో వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు సినీ తారలు, రాజకీయ ప్రముఖులు ముందుకు వస్తున్నారు. తమ వంతు సాయంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళాలు ప్రకటిస్తున్నారు.


తాజాగా ఎమ్మెల్యే, నటసింహ నందమూరి బాలకృష్ణ సైతం భారీ విరాళం ప్రకటించారు. వరద బాధితుల సహాయార్థం



తన వంతు సాయంగా ఒక్కో రాష్ట్రానికి రూ.50 లక్షలు చొప్పున మొత్తం రూ.కోటి విరాళంగా ఇవ్వనున్నట్లు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి ఈ మొత్తాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రకటన విడుదల చేశారు. '50 ఏళ్ళ క్రితం మా నాన్నగారు నా నుదుటిన దిద్దిన తిలకం ఇంకా మెరుస్తూనే ఉంది. 50 ఏళ్ల నుంచి నా నట ప్రస్థానం సాగుతూనే ఉంది.. వెలుగుతూనే ఉంది. తెలుగు భాష ఆశీస్సులతో, తెలుగుజాతి అభిమాన నీరాజనాలతో పెనవేసుకున్న బంధం ఇది. ఈ ఋణం తీరనిది. ఈ జన్మ మీ కోసం.. మీ ఆనందం కోసం. నా ఈ ప్రయాణంలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. ప్రస్తుతం తెలుగు నేలను వరద ముంచెత్తుతోంది. ఈ విపత్కర పరిస్థితులలో బాధాతప్త హృదయంతో ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు, అదేవిధంగా తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50 లక్షలు నా బాధ్యతగా బాధిత ప్రజల సహాయార్థం విరాళంగా అందిస్తున్నాను. రెండు రాష్ట్రాల్లో అతి త్వరలోనే సాధారణ పరిస్థితులు నెలకొనాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. మీ నందమరి బాలకృష్ణ' అని పేర్కొన్నారు.

# తోడేళ్లు కనిపిస్తే కాల్చేయండి.. సీఎం ఆదేశాలు

**లఖ్‌నవూ :** ఉత్తరప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లా ప్రజలను తోడేళ్లు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. చిన్నారులపై దాడి చేసి వారి ప్రాణాలను బలిగొంటున్నాయి. అటువంటి పరిస్థితుల్లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తోడేళ్లు కనిపిస్తే కాల్చివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చిన్నారులపై తోడేళ్లు దాడి చేసి.. వారి ప్రాణాలు తీస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆపరేషన్ బేడియా' పేరటి గతంలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా నాలుగు తోడేళ్లను అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. అయినా తోడేళ్ల దాడి మాత్రం ఆగకుండా కొనసాగుతుంది. దీంతో బహరాయిచ్ జిల్లాలో తోడేళ్ల దాడిపై ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధ్యక్షతన జరిగిన ఉన్నతాస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ దాడుల ఘటనలకు సంబంధించిన తీవ్రతను దృష్టిలో పెట్టుకుని.. తోడేళ్లు కనిపిస్తే కాల్చివేయాలని సీఎం యోగి ఆదేశాలు జారీ చేశారు. సోమవారం రాత్రి గిరిధర్‌పూర్ ప్రాంతంలో అయిదేళ్ల బాలికపై తోడేలు దాడి చేసింది. అంతలో కుటుంబ సభ్యులు స్పందించడంతో.. బాలికను వదిలి తోడేలు అక్కడి నుంచి పరారైంది. తోడేలును పట్టుకునేందుకు ప్రయత్నించారు. అది చిక్కకుండా పరారైంది. బాలికను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఆ చిన్నారి ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. మరోవైపు హర్ది ప్రాంతంలో తల్లి పక్కనే నిద్రిస్తున్న బాలుడి




పీకను తోడేలు నోట కరిచి ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించింది. ఇంతలో వింత శబ్దం వినిపించడంతో.. ఆ తల్లి మేల్కొని తోడేలు మెడను గట్టిగా పట్టుకుంది. అనంతరం ఆమె బిగ్గరగా కేకలు వేసింది. స్థానికులు వెంటనే స్పందించి.. అక్కడకి రావడంతో ఆ బాలుడిని వదిలి తోడేలు పరారైంది. ఆ బాలుడు సైతం ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బహరాయిచ్ జిల్లాలో వరుస తోడేళ్ల దాడుల కారణంగా 35 గ్రామాల్లో ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది.

**తోడేళ్ల దాడులపై జిల్లా కలెక్టర్ స్పందన..**

ఈ ఏడాది జులై 17వ తేదీ నుంచి జిల్లాలో చిన్నారులపై తోడేళ్లు దాడి చేస్తున్నాయని బెహరాయిచ్ జిల్లా కలెక్టర్ మోనికా రాణి వెల్లడించారు. తోడేళ్ల దాడుల్లో ఇప్పటి వరకు 8 మంది మరణించారని తెలిపారు. వారిలో ఏడుగురు చిన్నారులే ఉన్నారన్నారు. ఈ తోడేళ్ల దాడిలో మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారని చెప్పారు. తోడేళ్లను పట్టుకునేందుకు పోలీసులు, అటవీ శాఖ అధికారులు, స్థానిక పంచాయతీ అధికారులు సంయుక్తంగా కలిసి పని చేస్తున్నారని పేర్కొన్నారు. అటవీ ప్రాంతంలో తోడేళ్ల ఆచూకీ కోసం డ్రోణుల సహాయం తీసుకుంటున్నామని వెల్లడించారు. చిన్నారులపై దాడి చేస్తున్న తోడేళ్లను పట్టుకునేందుకు జిల్లా యంత్రాంగం పలు చర్యలు సైతం చేపట్టిందని వివరించారు. అందులోభాగంగా టెడ్డి బొమ్మలను చిన్నారుల మూత్రంతో తడిపి అటవీ, నిర్మానుష్య ప్రాంతంలో ఉంచుతున్నామని చెప్పారు. ఈ టెడ్డి బొమ్మలను చిన్నారులుగా భ్రమించి.. తోడేళ్ల వస్తే పట్టుకునేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇంకోవైపు తోడేళ్ల గుంపు ప్రాంతాలను మారుస్తూ.. జిల్లాలో సంచరిస్తుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. అందువల్లే తోడేళ్లను పట్టుకోవడంలో తీవ్ర ఆలస్యమవుతుందని చెప్పారు.

## డెంగ్యూని ఎపిడెమిక్‌గా ప్రకటించిన కర్ణాటక సర్కారు..




పొరుగు రాష్ట్రమైన కర్ణాటక డెంగ్యూ జ్వరాలతో అల్లాడుతున్నది. ఈ క్రమంలో డెంగ్యూని ఎపిడెమిక్‌గా ప్రకటించింది. దీంతో పాటు కర్ణాటక ఎపిడెమిక్ డిసీజెస్ రెగ్యులేషన్ 2020ని సవరించేందుకు నియమాలను రూపొందించింది. ఆరోగ్యశాఖ గణాంకాల ప్రకారం.. ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు 7,362 డెంగ్యూ కేసులు రికార్డయ్యా యి. ఇప్పటివరకు ఏడుగురు మరణించారు. డెంగ్యూ రోగులను చేర్చుకోవడానికి ఆసుపత్రిలోని ప్రతి వార్డులో పది పడకలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. డెంగ్యూ నివారణకు కార్యాచరణ ప్రణాళికను సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. మురికివాడల్లో నివసించే ప్రజలకు దోమతెరలు అందిస్తామని.. ప్రభుత్వం పరిస్థితిని పర్యవేక్షించాలని అన్నిశాఖలకు ఆదేశాలు ఇచ్చిననట్లు కర్ణాటక ఆరోగ్యమంత్రి దినేశ్ తెలిపారు. డెంగ్యూ వ్యాప్తిని తగ్గించేందుకు అన్నిశాఖలను కఠినమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఇంటింటికి వెళ్లి సేవలు అందించాలని ఆశా వర్కర్స్, వలంటీర్లను కోరామన్నారు. దోమల వ్యాప్తిని నివారించి.. డెంగ్యూ వ్యాప్తిని అరికడతామన్నారు.

## ఆప్‌తో పొత్తుకు కాంగ్రెస్ కసరత్తు



హరియాణ అసెంబ్లీ ఎన్నికలు మరో నెలలో జరగనుండటంతో ఆ రాష్ట్రంలో ఆప్‌తో పొత్తుకు కసరత్తు సాగించాలని రాష్ట్ర కాంగ్రెస్ నేతలను కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ కోరారు. కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన పార్టీ ఎన్నికల కమిటీ భేటీలో రాహుల్ గాంధీ ఆప్‌తో పొత్తు ప్రతిపాదనను పరిశీలించాలని పార్టీ ముందుంచినట్టు సమాచారం. పంజాబ్‌లో 90 అసెంబ్లీ స్థానాలకు గాను ఆప్ అభ్యర్థులకు 3, 4 స్థానాలు కేటాయించాలని కోరినట్టు పంజాబ్ మాజీ సీఎం భూపీందర్ సింగ్ హుడా చెప్పారు. ఇక 30 స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన కాంగ్రెస్ పార్టీ త్వరలో జాబితాను విడుదల చేయనుంది. ఆప్‌తో ఎన్నికల పొత్తుకు సంబంధించి చర్చలపై కాంగ్రెస్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. హరియాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి దీటైన పోటీ ఇవ్వడం ద్వారా విపక్ష ఇండియా కూటమి పటిష్టంగా ఉందనే సంకేతాలు పంపేందుకు రాహుల్ గాంధీ ఆప్‌తో పొత్తుకు ఆసక్తి కనబరుస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పంజాబ్‌లో ఇటీవల ముగిసిన పార్లమెంట్ ఎన్నికల్లో పది స్థానాలకు గాను విపక్ష కూటమి 5 స్థానాల్లో విజయం సాధించింది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో మొత్తం పది స్థానాలనూ బీజేపీ గెలుచుకుంది. పంజాబ్‌లో కాంగ్రెస్ పరిస్థితి మెరుగవడంతో అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొంది సత్తా చాటాలని కాషాయ పార్టీని మట్టికరిపించాలని రాహుల్ గాంధీ కసరత్తు సాగిస్తున్నారు. మరోవైపు కాంగ్రెస్‌తో పొత్తు విషయంలో ఆప్ ఇంకా ఎలాంటి నిర్ణయం వెల్లడించలేదు. మనీల్యాండరింగ్ కేసులో ప్రస్తుతం జైలులో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌తో సంప్రదించిన మీదట ఈ దిశగా తుది నిర్ణయం తీసుకుంటామని ఆప్ ఎంపీ, ఆ పార్టీ సీనియర్ నేత సంజయ్ సింగ్ తెలిపారు.

## 'అపరాజిత' బిల్లుకు బెంగాల్ అసెంబ్లీ ఏకగ్రీవ ఆమోదం



**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో ట్రయినీ వైద్యురాలి హత్యాచార ఘటన ప్రకంపనలు సృష్టించిన నేపథ్యంలో అత్యాచారం, హత్య కేసుల్లో దోషులకు మరణదండన విధించేందుకు ఉద్దేశించిన 'అపరాజిత ఉమన్ అండ్ చైల్డ్ బిల్లు (వెస్ట్ బెంగాల్ క్రిమినల్ లాస్ అండ్ ఎమెండమెంట్)-2024ను బెంగాల్ ప్రభుత్వం అసెంబ్లీలో మంగళవారం ప్రవేశపెట్టింది. చర్చ అనంతరం దీనికి సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. ఇది 'చరిత్రాత్మిక బిల్లు' అని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసెంబ్లీలో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు. అత్యాచారం, లైంగిక నేరాలపై కొత్త ప్రొవిజన్స్‌తో రూపొందించిన ఈ బిల్లు మహిళలు, పిల్లలకు మరింత రక్షణ కల్పిస్తుందని అన్నారు.

బిల్లుపై చర్చలో మమతా బెనర్జీ మాట్లాడుతూ, అత్యాచారాలు మానవత్వానికి మాయని మచ్చ అని, అలాంటి నేరాలకు అట్టుకట్ట వేసేందుకు సామాజిక సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని మమతా బెనర్జీ అన్నారు. అపరాజిత బిల్లుపై సంతకం చేయాలని విపక్షాలు గవర్నర్ సీవీ ఆనంద బోస్‌ను కోరాలని సూచించారు. అనంతరం చట్టంగా తీసుకు వచ్చే బాధ్యత మనపై ఉందన్నారు. సీబీఐ నుంచి న్యాయం కోరుతున్నామని, దోషులకు మరణశిక్ష విధించాలని తాము కోరుతున్నామని చెప్పారు. 'అపరాజిత' బిల్లుతో సత్వర విచారణ, బాధితులకు న్యాయ లభిస్తుందన్నారు. బిల్లు పాస్ కాగానే ప్రత్యేక అపరాజిత టాస్క్‌ఫోరస్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. కోల్‌కతా ట్రయినీ డాక్టర్ మృతికి నివాళి అర్పించారు. కాగా, బిల్లుకు ప్రధాన విపక్షమైన బీజేపీ మద్దతు ప్రకటించింది. లా కమిటీ వద్దకు బిల్లు వెళ్లిందో లేదో తమకు తెలియని, అయితే బిల్లు తక్షణం అమలు కావాలని తాము కోరుతున్నామని, తక్షణ ఫలితాలు ఆశిస్తున్నామని, బిల్లుకు తమ మద్దతు ఉంటుందని అంతకుముందు మీడియాతో మాట్లాడుతూ అసెంబ్లీలో విపక్ష నేత సువేందు అధికారి చెప్పారు.

## ఆధారాలను ధ్వంసం చేస్తే దోషిని ఎలా నిర్ధారిస్తారు..? : దీదీపై సువేందు అధికారి ఫైర్




ఆర్జీ కర్ ఆస్పత్రిలో ట్రైనీ వైద్యురాలిపై హత్యాచార ఘటనకు ప్రధాన కారణం పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీయేనని బెంగాల్ అసెంబ్లీలో విపక్ష నేత సువేందు అధికారి ఆరోపించారు. మమతా బెనర్జీ తక్షణమే సీఎం పదవి నుంచి వైదొలగాలని ఆయన డిమాండ్ చేశారు. ఆధారాలు ధ్వంసం చేస్తే దోషిని ఎలా నిర్ధారిస్తారని ప్రశ్నించారు. కోల్‌కతా ఘటనకు నిరసనగా 5000 మందికి పైగా మహిళలు వీధుల్లోకి వచ్చారని, ఈ ప్రదర్శనకు తాము మద్దతు ప్రకటించామని సువేందు అధికారి తెలిపారు. ఆర్జీ కర్ సోదరి విషాదాంతానికి దీదీ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. కాగా పశ్చిమ బెంగాల్ సాంస్కృతిక, సారస్వత ఫోరం ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో మహిళలు ఆర్జీ కర్ ఘటనకు వ్యతిరేకంగా కోల్‌కతాలో మంగళవారం నిరసన ప్రదర్శన చేపట్టారు.కాగా, కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా పెనుదుమారం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు వ్యతిరేకంగా కోల్‌కతాలో విపక్షాలు, మహిళా, ప్రజా సంఘాల నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. మరోవైపు మహిళలపై నేరాలకు చెక్ పెడుతూ కఠిన చట్టాన్ని తీసుకురావాలని కోరుతూ తాను ప్రధాని నరేంద్ర మోదీకి రెండు లేఖలు రాసినా ఎలాంటి స్పందన లేదని మమతా బెనర్జీ బెంగాల్ అసెంబ్లీలో పేర్కొన్నారు. తన లేఖలపై మహిళా, శిశు సంక్షేమ శాఖ నుంచీ, కేంద్ర ప్రభుత్వం నుంచీ సమాధానం రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రాణనష్టం తగ్గించగలిగాం

-మొదటిపేజీ తరువాయి

చెరువుల ఆక్రమణకు సహకరించిన అధికారులపైన చర్యలు తీసుకోవాలని అన్నారు.చెరువులు, నాలాల ఆక్రమణల జాబితా సిద్ధం చేయాలి. మాజీ మంత్రి ఆక్రమణ వల్లనే ఖమ్మంలో వరదలు వచ్చాయనే ఫిర్యాదులు వచ్చాయి. అమెరికాలో జల్సాలో మునిగి తేలుతున్న ఆయన.. ప్రభుత్వం పైన విమర్శలు చేస్తున్నడు. వంద ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు వెళ్లినట్లుగా హరీష్ రావు ఖమ్మం పర్యటనకు పోయిండు. ఖమ్మం మాజీ మంత్రి ఆక్రమణలపైన తొలగింపునకు హరీష్ రావు సహకరిస్తారా? 28 సెంటిమీటర్ల వర్షం కురిసినప్పటికీ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించారు. అయినా ప్రాణ నష్టం జరగడం బాధాకరం. జిల్లాలో నలుగురు చనిపోయారు. అందులో ఇద్దరు ఈ జిల్లా వాసులు, మరో ఇద్దరు ఖమ్మం జిల్లా వాసులు ఉన్నారు. మహబూబాబాద్ జిల్లాలో సుమారు 30 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. 680 మందికి పునరావాసం కల్పించాం. సీతారామ తండాలో వరద సమయంలో ప్రజలకు అండగా నిలబడ్డ ఎస్సై నగేష్ కి అభినందనలు. చనిపోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తాం. ఆకేరు వాగు వరద బారిన పడుతున్న 3 తండాలను ఒకే ప్రాంతానికి తరలించి అదర్శ కాలనీ నిర్మించాలని కలెక్టర్ కు ఆదేశించాం. పంట నష్టం జరిగిన ప్రతి ఎకరానికి రూ.10 వేల సాయం అందిస్తాం. తెలంగాణలో వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించాలని ప్రధానికి లేఖ రాశాం. జరిగిన



నష్టాన్ని పరిశీలించడానికి రాష్ట్రానికి రావాలని ప్రధాన మంత్రిని కోరుతున్నాం. వరదతో చేరిన బురదను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. దోమల నివారణ చర్యలు తీసుకోవాలి. నష్టం జరిగిన ప్రాంతాల్లో సహాయక చర్యల కోసం ఇతర ప్రాంతాల నుంచి అధికారులను రప్పించుకోవాలి. కూలిపోయిన విద్యుత్ లైన్లను తక్షణమే పునరుద్ధరించాలి. వరద ప్రమాద ప్రాంతాలు, ప్రమాదానికి కారణాలు, వాటిని ఎదుర్కొన్న తీరుపైబ్లూబుక్ ను తయారు చేసుకోవాలి. వాటిని కలెక్టరేట్లలో ఉంచాలి. వరదలు వచ్చినప్పుడు కేసీఆర్ పదేళ్లలో ఎప్పుడైనా పరామర్శకు వచ్చారా..? మాసాయిపేటలో పసిపిల్లలు చనిపోతే కేసీఆర్ పరామర్శించలేదు. హైదరాబాద్ శివారులో పశు వైద్యురాలిని హత్యచేస్తే వెళ్లి చూడలేదు. మానవత్వం లేని మనిషి కేసీఆర్. ప్రతిపక్ష నేత ఎక్కడున్నాడు? ఎందుకు మాట్లాడటం లేదు? స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థలు వరద బాధితులకు సాయం కోసం ముందుకు రావాలి” అని రేవంత్ రెడ్డి పిలుపు ఇచ్చారు.

### ఎవ్వరిని వదిలిపెట్టం

ఎక్కడికక్కడ వరద సమస్యలు పరిష్కరించేలా.. కలెక్టర్లకు, ఇంచార్జ్ మంత్రులకు పూర్తి స్వేచ్ఛనిస్తున్నామని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. వరదలతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు దెబ్బతిన్నాయని.. ప్రాణనష్టం తగ్గించగలిగామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులను అభినందిస్తున్నానన్నారు. వరద బాధితులకు సహాయక చర్యలు కొనసాగుతాయని.. 30 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు అంచనా అందిందన్నారు.కాగా.. రాష్ట్రంలో ఆక్రమణలపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చెరువులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు కూడా విస్తరిస్తామన్నారు. అలాంటి వ్యవస్థతోనే కఠిన చర్యలు తీసుకోవాలంటూ అధికారులకు సూచించారు. ఎవరెన్ని మాట్లాడినా ఆక్రమణలకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిందేన్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా హైడ్రా ముందుకు వెళ్తుందన్నారు. చెరువుల కబ్జాలతోనే ఈ ప్రకృతి వైపరీత్యమని.. చెరువులు, కుంటల కబ్జాలపై చర్యలు తప్పవు అంటూ హెచ్చరించారు. నాలాల ఆక్రమణలను ఉపేక్షించేదిలేదని.. కబ్జాలు, ఆక్రమణలు చేసేవారు ఎంతటివారైనా వదిలేదిలేదంటూ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంచేశారు.

# వరద బాధితులను ఆదుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

-మొదటిపేజీ తరువాయి

చర్యలు పరిశీలించేందుకు వచ్చాం. పాలేరు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి సహాయం అందించారు. పువ్వాడ అజయ్ ఖమ్మంలో ఆయా డివిజన్ల ప్రజలకు నిత్యావసరాలు అందిస్తున్నారు. ఖమ్మం ప్రజలను ఆదుకోవాలని ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని ముందుకు వచ్చాం. వార్డుల్లో ప్రజలను కలుస్తుంటే పరిస్థితి హృదయ విదారకంగా ఉంది. కళ్లల్లో నీళ్లు పెట్టుకుంటున్నారు. పసి పిల్లలకు పాలు దొరకక బాధపడుతున్నారు. తాగడానికి మంచినీళ్లు లేవు.. నిత్యావసరాలు అందించడంలో ప్రభుత్వం విఫలం చెందిందని తమ ఆవేదన వ్యక్తం చేశారని హరీశ్‌రావు తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ముందుస్తుగా మైక్‌లో అనౌన్స్ చేసి అలర్ట్‌గా బయటకు తీసుకెళ్లారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి సహకారం అందింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలను అలర్ట్ చేయలేకపోయారు. వారి ప్రాణాలను కూడా కాపాడుకోలేకపోయింది. 9 మంది ఎమ్మెల్యేలను గెలిపించినా కూడా 9 మందిని కాపాడాలేకపోయారు. కనీసం హెలికాప్టర్‌ను కూడా పంపలేకపోయారు అని హరీశ్‌రావు మండిపడ్డారు.

### సీఎం రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ.. పనితనం తక్కువ

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యంగ్యం ఎక్కువ, పనితనం తక్కువ అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. ఖమ్మంలో 9 మంది ఎమ్మెల్యేలను గెలిపిస్తే 9 మంది ప్రాణాలు కూడా కాపాడలేకపోయారు. వాతావరణ శాఖ భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించిన ప్రభుత్వం పట్టించుకోలేదు అని ఎమ్మెల్యే హరీశ్ రావు ధ్వజమెత్తారు. ఎక్కడా చూడు వ్యంగమే.. పాలనపై రేవంత్ రెడ్డి పట్టు కోల్పోయారు. చీటిమాటికి ప్రతిపక్షాలపై బురద జల్లుతున్నారు. ఇంకా మొద్దు నిద్ర నుంచి మేల్కొనలేదు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున వర్షాలు పడబోతున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించినా ప్రభుత్వం ముందుస్తు చర్యలు తీసుకోలేదు. దీంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగింది. దాదాపు ఒక్కో కుటుంబానికి రూ. 10 లక్షల వరకు నష్టం జరిగింది. కట్టుబట్టలతో బయటపడ్డామని వరద బాధితులు ఆవేదన చెందుతున్నారు. సర్టిఫికెట్లు, బియ్యం, నిత్యావసర వస్తువులు తడిసిపోయాయని కన్నీరుమున్నీరు అవుతున్నారు. కష్టపడి సంపాదించుకున్న బంగారం కొట్టుకుపోయిందం



టున్నారు. 12 గంటల పాటు తాగడానికి నీళ్లు లేక విలవిలలాడిపోయారట. రెండు రోజుల నుంచి తినడానికి తిండి లేదని బాధపడుతున్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం అని హరీశ్‌రావు మండిపడ్డారు. చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షలు ఇవ్వాలని ఇదే రేవంత్, సీతక్క ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అడిగారు. ఆ మాట ప్రకారం తక్షణమే చనిపోయిన కుటుంబాలకు రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వండి. మాట మీద నిలబడాలని డిమాండ్ చేస్తున్నాం. వరదలో పూర్తిగా మునిగిన ఇండ్లకు తక్షణమే రూ. 2 లక్షలు సాయం చేయాలని కోరుతున్నాం. మీరు ఇచ్చే రూ. పది వేలు ఏ మూలకు సరిపోవు.. దయచేసి ఆదుకోండి.. పిల్లల సర్టిఫికెట్లు తడిసి ముద్దయ్యాయి.. వారందరికి ఉచితంగా సర్టిఫికెట్లు అందజేయాలని డిమాండ్ చేస్తున్నాం. బియ్యం ఇచ్చినా వండుకొనే పరిస్థితి లేదన్నారు. ఇంట్లో బురద ఉన్నాక ఎలా వండుకుంటామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివాళాకోరు ప్రభుత్వం ఇది. రేవంత్ రెడ్డికి వ్యంగం ఎక్కువ.. మోకాలికి, బోడిగుండుకు లింక్ పెట్టి పిచ్చి మాటలు మాట్లాడే ప్రయత్నం చేస్తున్నాడని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. వరద సహాయక చర్యల్లో కేంద్రం కూడా విఫలమైంది. ఎన్డీఆర్ఎఫ్ బృందాలను, హెలికాప్టర్లను పంపలేకపోయింది. ప్రజల ప్రాణాలను కాపాడడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయి. సీఎంను డిమాండ్ చేస్తున్నాం.. అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలి. మోదీని నిలదీద్దాం.. సహాయం ఎందుకు చేయరో అడుగుదాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల ప్రజలు బలయ్యారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

### వరదలకు చనిపోయిన వారి విషయంలోనూ రేవంత్ అబద్ధాలు.. మండిపడ్డ హరీశ్‌రావు

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలకు చనిపోయిన వారి విషయంలోనూ సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలు చెబుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు మండిపడ్డారు. చనిపోయిన వారి విషయంలో సంఖ్య తక్కువ చేసి చూపించే ప్రయత్నం చేస్తున్నారు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి 16 మంది చనిపోయినట్టు చెప్పారు. కానీ మా వద్ద స్పష్టంగా వివరాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలకు, వరదలకు 30 మంది చనిపోయిన వారి వివరాలు ఉన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 11 మంది, మహబూబాబాద్‌లో 3, సూర్యాపేటలో ఇద్దరు, , ములుగులో ఇద్దరు, ఆదిలాబాద్‌లో ఒక్కరు, నారాయణపేటలో ఇద్దరు, నాగర్‌కర్నూల్‌లో గుర్తు తెలియని డెడ్ బాడీ దొరికింది. వనపర్తిలో ఒకరు, పెద్దపల్లిలో ఇద్దరు, కామారెడ్డిలో ఒకరు, సిద్దిపేటలో ఇద్దరు, రంగారెడ్డిలో ఇద్దరు చనిపోయారు. ప్రభుత్వం ఏమో 16 మంది అని చెబుతున్నారు. మరణాల విషయంలోనూ ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుందని హరీశ్‌రావు మండిపడ్డారు. భక్తరామదాసు, పాలమూరు ఎత్తిపోతల పంప్ హౌస్‌లు నీట మునిగాయి. దీనికి పూర్తిగా ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. 2 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. ప్రభుత్వ యంత్రాంగం సకాలంలో స్పందించి ఉంటే వేల ఎకరాల్లో పంట నష్టం జరిగి ఉండకపోయేది. నష్టపోయిన పంటకు ఎకరానికి రూ. 30 వేలు ఇవ్వాలని గతంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. ప్రతి ఎకరాకు రూ. 30 వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. మీ తప్పిదం వల్ల సాగర్ కెనాల్ తెగిపోయింది. రైతులు బాధపడుతున్నారు. కన్నీళ్లు పెట్టుకున్నారని హరీశ్‌రావు తెలిపారు. అన్ని మేమే చేస్తే సీఎం కుర్చీలో నువ్వు ఎందుకు రేవంత్ రెడ్డి. రైతు రుణమాఫీ కాలేదంటే హరీష్ రావు ఇంటింటికి పోయి కాగితాలు జమచేసి తెచ్చి ఇవ్వాలంటాడు. కేంద్రం బడ్జెట్లో నిధులు కేటాయించకపోతే కేసీఆర్ వెళ్లి ఢిల్లీలో దీక్ష చేయాలంటాడు. వరదలు వచ్చినాయి సహాయం చేయండి అంటే బీఆర్ఎస్ వాళ్ళు చేయాలంటాడు. అన్ని మేమే చేస్తే సీఎం కుర్చీలో నువ్వు ఎందుకు రేవంత్ రెడ్డి? అని హరీశ్‌రావు నిలదీశారు.

## వరద బాధితులకు కేంద్ర సాయం..

**హైదరాబాద్:** వరదల్లో చనిపోయిన వారికి కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 3లక్షలు వస్తాయని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్ రెడ్డి హామీ ఇచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన రూ. 5లక్షల్లో కేంద్రం ఇచ్చే రూ. 3లక్షలు కలుపుకొని ఇస్తారా? లేదా? రాష్ట్ర ప్రభుత్వమే రూ. 5లక్షలు ఇస్తోందా? అనే విషయంపై క్లారిటీ లేదని కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు (మంగళవారం) బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ... ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారికి.. వారం రోజుల కంటే ఎక్కువ రోజులు ఉంటే రూ. 16వేలు, వారం లోపుల ఆస్పత్రిలో ఉంటే రూ. 4 వేలను ఆస్పత్రి ఖర్చులకు కేంద్రం ఇస్తుందని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

ఎస్డీఆర్ఎఫ్ నిధులతో బాధితులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. యుటిలైజేషన్ నిధులపై బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఇప్పటివరకు ఎలాంటి రిపోర్ట్ విడుదల చేయలేదని చెప్పారు. ఎస్డీఆర్ఎఫ్ కింద రాష్ట్ర ప్రభుత్వం వద్ద రూ. 1300 కోట్లకు పైగా నిధులు ఉన్నాయని తెలిపారు. మరో రూ. 200 కోట్లు యూసీ నిధులున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి నివేదిక సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం దానికి తగిన నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు.

అంటు వ్యాధులు సోకకుండా మెడిసిన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17ఉత్సవాలపై రాష్ట్ర ప్రభుత్వం చేతులెత్తేసిందని విమర్శలు చేశారు. దీంతో కేంద్ర ప్రభుత్వమే నిర్వహించాల్సిన దుస్థితి నెలకొందని అన్నారు. 1948లో నిజాం లొంగిపోయిన రోజు... గణేష్ నిమజ్జనం ఒకేరోజు జరిగిందని చెప్పారు. మళ్లీ 75ఏళ్ల తర్వాత ఇది రిపేట్ అవ్వడం సంతోషమని కిషన్‌రెడ్డి వెల్లడించారు.

# అత్యవసరమైతేనే బయిటకు రండి

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని వరద ప్రాంతాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించారు. హిమాయత్ సాగర్ జలాశయాన్ని మంత్రి పరిశీలించారు. మరో రోజు వర్షాలు పడినా హిమాయత్ సాగర్ జలాశయం నిండిపోతుందన్నారు. జలాయశయం నిండితే కింద ఉన్న ప్రాంతాలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ,రంగారెడ్డి కలెక్టర్లకు ఆదేశించారు. మరో 5 వేల క్యూసెక్కుల నీళ్ళు వస్తే ఓవర్ ఫ్లో అవుతుందన్నారు. ప్రభుత్వం తరుపున అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తోందని వివరించారు. విపత్కార సమయంలో రాజకీయాలు చేయొద్దని ప్రతిపక్షాలను కోరారు. రాజకీయాలు అసెంబ్లీ వేదికగానో,ఎన్నికలు వచ్చినప్పుడు చూసుకుందామని సలహా ఇచ్చారు. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు ఒకరు అమెరికాలో ఉండి ఒకరు ఫార్మ్ హౌస్‌లో ఉండి ట్విట్టర్ వేదికగా విమర్శలు చేయడం సరికాదని విమర్శించారు. విపత్తుల సమయంలో జరిగిన మరణాలు ప్రమాదవశాత్తు జరిగాయని తెలిపారు. ఎక్కడ కూడా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల జరిగినవి కావన్నారు. వారిని ఆదుకోవడానికి 5 లక్షల పరిహారం ఇస్తున్నామన్నారు. ఎప్పటికప్పుడు అందరినీ అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ యంత్రంగా 24 గంటలు పని చేస్తూ ప్రజలకు సేవలు అందిస్తున్నారని వివరించారు.జాతీయ విపత్తుగా గుర్తించి భారీగా నిధులు కేంద్రం రిలీజ్ చేసేలా బీజేపీ కృషి చేయాలని సూచించారు. తక్షణం సాయం కింద 2000 కోట్లు అందించేలా కేంద్రాన్ని ఒప్పించాలన్నారు. గతంలో ఇలాంటి ప్రకృతిలు వస్తే ప్రజలకు ఎలాంటి సాయం చేయని పరిస్థితి ఉండేదని ఆరోపించారు. కొండగట్టులో 69 మంది చనిపోతే కనీసం ఒక్కరూ కూడా వచ్చి పరమర్శించని దుస్థితి ఉండేదన్నారు. మానవీయ కోణం లేని బీఆర్ఎస్ నేతలు తమను విమర్శించడం ఏంటని నిలదీశారు.ముఖ్యమంత్రి ఖమ్మం వెళ్లి అక్కడ పర్యటించి రాత్రి అక్కడే ఉన్నారని గుర్తు చేశారు. ఉదయం మహబూబాబాద్ వచ్చారని పేర్కొన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉత్తర తెలంగాణ జిల్లాలో రెడ్ అలెర్ట్ ప్రకటించిందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రయాణాలు పెట్టుకోవాలన్నారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను బట్టి పాఠశాలకు సెలవులు ప్రకటించాలని అధికారులకు సూచించారు. 33 జిల్లా కలెక్టర్లు, గ్రామ కార్యదర్శి మొదలు సిఎస్ వరకు అంతా రాత్రీపగలు పని చేస్తున్నారన్నారు.

### అధికారులు, నేతలంతా ప్రజల్లోనే...

ఎక్కడైనా ఆపద ఉన్న విపత్తు కలిగితే కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు,ఎంపీలు అందరూ ప్రజల్లోనే ఉన్నారని వివరించారు. రాజకీయాలు అవసరం లేదన్న ఆయన... అందరూ ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. జరిగిన నష్టంపై కేంద్రాన్ని నిలదీద్దామన్న ఆయన... బడ్జెట్ లా మొండి చేయి చూపకుండా సహకరించాలన్నారు. ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది ప్రజలు ధైర్యంగా ఉండాలని సూచించారు.

## ఆరువేల కోట్లనష్టం

-మొదటిపేజీ తరువాయి

నామరూపాల్లేకుండా చేశాయి. పంట పొలాలు నదులను తలపిస్తున్నాయి. భవనాల్లోని రెండో అంతస్తుల్లోకి నీరు వచ్చి చేరింది. చెరువులకు చాలా ప్రాంతాల్ల గండ్లు పడ్డాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా విధ్వంసం జరిగిందని ప్రభుత్వం చెబుతోంది. బాధిత ప్రజలు కోలుకున్న తర్వాత వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారుల బృందాలు పర్యటించి నష్టాన్ని అంచనా వేయనున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టాల్లో ప్రధానమైంది పంట నష్టాలు. సమారు నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగినట్టు వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇది ప్రాథమిక అంచనా మాత్రమేనని ఇంకా క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే మాత్రం ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన నాలుగున్నర కోట్లపైగానే నిధులు కావాల్సి ఉంటుంది. వరద నష్టాల్లో ఇది ప్రధానమైంది. వరద నష్టాల్లో రెండో ప్రధానమైంది దెబ్బతిన్న భవనాలు. ఇప్పుడు చాలా మంది ప్రజల ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరికొన్ని నీట మునిగి దెబ్బతిన్నాయి. వాటిని గుర్తించి వారికి పరిహారం ఇవ్వాల్సి ఉంటుంది. దీనిపై కూడా ప్రభుత్వం ఓ అంచనాకు వచ్చింది. ఇలా దెబ్బతిన్న భవనాల్లో ప్రభుత్వ భవనాలు కూడా ఉంటాయి. ఇవి మాత్రం నేరుగా వెళ్లి పరిశీలించిన తర్వాత అంచనాకు రాగలమని అధికారులు చెబుతున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో భారీగా రోడ్లు దెబ్బతిన్నాయి. దాదాపు దీని నష్టం రెండువేల కోట్లకుపైగానే ఉంటుందని, వంతెనలు మరో ఏడు వందల కోట్లు నష్టం జరిగి ఉంటుందని అంటున్నారు. పంచాయతీ రోడ్లు, మిషన్ భగీరథ పైపులైన్ల పునరుద్ధరణకు దాదాపు 200 కోట్లు అవసరం అవుతాయని అధికారులు లెక్కగడుతున్నారు. వరదల కారణంగా ట్రాన్స్‌కోకు భారీ నష్టం వాటిల్లింది. ఎక్కడికక్కడ వైర్లు తెగిపడ్డాయి. స్తంభాలు కూలిపోయాలి. ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతిన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్లు కూడా నీట మునిగిపోయాయి. ఈ రిపేర్ల కోసం దాదాపు 150 కోట్లకుపైగానే నిధులు అవసరం అవుతాయి.వీటితోపాటు ఆసుపత్రుల్లో జరిగినష్టం, వీధిలైట్లు, డ్రైనేజీలు, ఇతర నష్టాలు దాదాపు 15 వందల కోట్లకుపైగానే ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వస్తున్నారు అధికారులు. ఓవరాల్‌గా చూసుకుంటే మాత్రం ఆరు వేల కోట్ల వరకు నష్టాన్ని ఇప్పటికి అంచనా వేస్తున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. వాతావరణ హెచ్చరికలతో అప్రమత్తమై ప్రాణ నష్టాన్ని తగ్గించగలిగామని ఆస్తి నష్టాన్ని మాత్రం తగ్గించలేకపోయామని అంటున్నారు. వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులను యుద్ధప్రాతిపదికన అధికారులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే చాలా ప్రాంతాలకు రాకపోకలు ప్రారంభమయ్యాయి. రైల్వే ట్రాక్‌లను కూడా పునరుద్ధరించారు. కేసముద్ర మండలం తాళ్లపూసపల్లి, ఇంటికన్నె వద్ద దెబ్బతిన్న రైల్వే ట్రాక్‌ను పునర్‌నిర్మించే పనులు విస్తృతంగా సాగుతున్నాయి. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం రామాపురం వద్ద దెబ్బతిన్న పాలేరు బ్రిడ్జిని రిపేర్ చేసి రాకపోకలకు అనుమతిచ్చారు. దీన్ని గంటల వ్యవధిలోనే పూర్తి చేశారు. అయితే ఇంకా కొన్ని ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిని రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. కుమ్రంభీం జిల్లాలో తెలంగాణ– మహారాష్ట్ర నేషనల్హైవే పెనుగంగా నది నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆదిలాబాద్ జిల్లాలో కూడా చాలా ప్రాంతాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. వీటి పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు.

## పథకం ప్రకారమే మాపై దాడి



**ఖమ్మం :** ఖమ్మం ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మాజీ మంత్రులపై కొంతమంది వ్యక్తులు దాడి చేశారు. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వాహనంపై రాళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో బీఆర్ఎస్ నేతలకు గాయాలు అయ్యాయి. ఈ ఘటనను మాజీ మంత్రులు తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్టంలో పాలన బాగోలేగదని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో ప్రజలకు న్యాయం చేయడానికి వచ్చామని... ఇది ప్రభుత్వ వైఫల్యం అని బాధితులు చెబుతున్నారన్నారు. ఈరోజు పథకం ప్రకారం తమపై దాడి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ గుండాలు పోలీసుల ముందే దాడి చేశారన్నారన్నారు. దాడి చేసిన గుండాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. “ మంత్రులు నీతులు చెపుతారు. జరిగిన దాడిపై ఖండించండి” అని అన్నారు. వరద వచ్చినా మంత్రులు నిద్రలోనే ఉన్నారంటూ విరుచుకుపడ్డారు. ప్రజలు చెపితేనే లేచారన్నారు. ఇక్కడ ప్రజలకు అన్యాయం జరిగిందని నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రజలను ఈ ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. “ప్రతిపక్షాలు రావాలని సహాయం చేయాలంటారు. వచ్చిన మాపై దాడి చేస్తారా. మీ వైఫల్యం దాచడానికి ఈ చిల్లర రాజకీయాలు చేస్తున్నారు. మమ్మలను బెదిరించలేరు. ప్రజల చేత మీకు బుద్ధి చెప్పిస్తాం. పోలీస్ అధికారులు దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇలాంటివి చిల్లర వాటిని పట్టించుకోవద్దు” అంటూ మాజీ మంత్రి జగదీష్ రెడ్డి సూచించారు.

### ప్రతిపక్షంగా మేము చేయాల్సిన బాధ్యత మాపై ఉంది

“ఖమ్మం ప్రజలు మూడు రోజులుగా అల్లడుతున్నారు..ప్రతిపక్షంగా మా పని.. మేము చేయాల్సిన బాధ్యత మాపై ఉంది” అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. వరద బాధితులకు సహాయం చేయడానికి బీఆర్ఎస్ నాయకులు వచ్చారని తెలిపారు. వచ్చిన పని వదిలేసి ప్రతిపక్షంపై బురద జల్లుతూ వరద బాధితులను కాంగ్రెస్ నేతలు మరిచారని మండిపడ్డారు. “కాంగ్రెస్ గుండాలతో మాపై హత్యాయత్నం చేయించారు. మాపై దాడికి మంత్రులదే బాధ్యత. దాడి కారణమైన వారిపై సిపికి ఫిర్యాదు చేస్తాం. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. పోలీసులకు పిర్యాదు చేస్తాం. ఉద్యమం నడిపిన చరిత్ర బీఆర్ఎస్‌కు ఉంది. మాపై దాడి జరిగింది చర్యలు తీసుకోవాలి. వరద బాధితులను ఆదుకోవాలి” అని డిమాండ్ చేశారు. హరీష్‌రావు మాట్లాడుతూ.. ఈరోజు ఖమ్మంలో జరిగిన దాడిని డీజీపీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీతో సంబంధాలు ఉన్నాయి కాబట్టి కేంద్ర సాయం కోసం గట్టిగా నిలదీయలేకపోతున్నారని విమర్శించారు. ఇంత విపత్తు జరిగిన కేంద్రాన్ని రేవంత్ ఎందుకు నిలదీయడం లేదని హరీష్‌రావు ప్రశ్నించారు.

## ఔటర్ రింగ్ రోడ్డులోని 51 గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తు ఆర్డినెన్స్




హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని 51 గ్రామాలను ఆయా మున్సిపాలిటీలలో విలీనం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. ఒక్కో మున్సిపాలిటీలో ఒకటి నుంచి ఆరు వరకు గ్రామాలను విలీనం చేసింది. రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి జిల్లాల్లోని పలు గ్రామాలు ఈ విలీనమైన జాబితాలో ఉన్నాయి. పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీలో నాలుగు గ్రామాలు, శంషాబాద్‌లో ఆరు, నార్సింగి, తుక్కుగూడలలో ఒక్కో పంచాయతీ, మేడ్చల్‌లో రెండు, దమ్మాయిగూడలో ఆరు, నాగారంలో ఐదు, పోచారంలో ఐదు, ఘట్‌కేసర్‌లో ఆరు, గుండ్లపోచంపల్లిలో రెండు, తూంకుంట మున్సిపాలిటీలో మూడు పంచాయతీలను విలీనం చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేసింది.

## విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు


రాష్ట్ర విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్, ముగ్గురు సభ్యులతో ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రీ ప్రైమరీ నుంచి ఉన్నత విద్య వరకు సమగ్ర పాలసీ తయారీలో ఈ కమిషన్ కీలక పాత్ర పోషించనుంది. చైర్మన్, సభ్యులను త్వరలో నియమిస్తామని ప్రభుత్వం తెలిపింది. విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకు రావాలని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా ఈరోజు విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

## సంపాదకీయం

# శ్రమ బీసీలది.. సంపద వాళ్ళకు

ఏ సమానత్వ సమాజంలోనైనా అన్ని వర్గాల మధ్య అధికారం సమానంగా పంచబడాలి. 'మెజార్టీ ఈజ్ లా' అన్నప్పుడు మెజారిటీ ప్రజల భాగస్వామ్యం లేకుండా ప్రజాస్వామ్యం ఎలా విజయం సాధించగలుగుతుంది?ఎస్సీ, ఎస్టీలకు 14% , 7% రాజకీయ రిజర్వేషన్ల మూలన రాష్ట్రపతి, ఉపప్రధాని, లోక్‌సభ స్పీకర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి పదవుల దాకా వారికి వెళ్లే అవకాశం ఏర్పడింది. అయితే జనాభాలో మెజారిటీగా 56% ఉన్న బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు లేనందున వల్లనే నేటికీ ఆ స్థాయికి చేరుకోలేకపోతున్నామన్న ఆవేదన ప్రతి బీసీ కులాల హృదయాల్లో ఉంది. వీరికి రాజకీయ పాలనాధికారం కేవలం ముఖ్యమంత్రులుగానో, మంత్రులుగానో పని చేయడం ద్వారా మాత్రమే కాదు.. రాజకీయంగా చట్టసభల్లో జనాభా ప్రాతిపదికన సీట్ల వాటా పొందినప్పుడే మాత్రమే నిజమైన అభివృద్ధి జరుగుతుంది. దేశంలో ఉన్న దాదాపు 2600 బీసీ కులాల్లో స్వాతంత్ర్యం వచ్చిన ఈ 78 సంవత్సరాలలో కేవలం 65 కులాలు మాత్రమే పార్లమెంట్, అసెంబ్లీలోలలో అడుగు పెట్టాయి. పార్లమెంటులో 15% కూడా బీసీల బలం లేదు. ఇందులో యూపీ, బిహార్, తమిళనాడు నుంచి మాత్రమే బీసీ ఎంపీలు ఎక్కువ. 16 రాష్ట్రాల నుంచి ఒక్క బీసీ ఎంపీ కూడా లేకపోవడం గమనార్హం. మొదటి నుంచి కూడా చాలా ప్రధాన పార్టీలు వీరికి కొన్ని సంక్షేమ పథకాలు ఇవ్వడం, విద్య, ఉద్యోగాలలో బొటాబొటి రిజర్వేషన్లు కల్పించడం, కొన్ని అప్రధానమైన శాఖలు ఇచ్చి తమ ప్రచారానికి వాడుకుని వదిలేస్తున్నాయి. ఇలాంటి జిమ్మిక్కులు బీసీల సమస్యలను పరిష్కరించలేవు. బీసీల వెనుకబాటుతనాన్ని తొలగించవు. రాజకీయ సీట్ల రిజర్వేషన్లు బీసీలకు అధికారానికి ప్రవేశ ద్వారం. కాబట్టి బీసీలకు రాజకీయ స్థానాల్లో రిజర్వేషన్లు తప్పనిసరి. వెనుకబడిన తరగతులకు సీట్లు రిజర్వ్ చేయకపోవడంతో బీసీ అభ్యర్థులు రాజకీయంగా, ఆర్థికంగా బలంగా ఉన్న అగ్రకులాల అభ్యర్థులతో పోటీ పడలేక మధ్యలోనే అపజయాలను మూటగట్టుకున్నారు. భారతదేశంలోని అగ్రవర్ణాల బిలియనీర్లు మాత్రం బాగా అభివృద్ధి చెందుతుండగా, మరోపక్క భారతదేశంలోని పేదలు ముఖ్యంగా బీసీ కులాలు జీవించడానికి కనీస అవసరాలు కూడా నేటికీ కూడా పొందలేకపోతున్నారు. భారతీయ అసమానతలపై 2023 ఆక్స్‌ఫామ్ నివేదిక చూస్తే సాధారణ పరిశీలన శక్తి ఉన్న ఎవరికైనా ఆశ్చర్యం కలిగించదు. భారతదేశ జనాభాలో 1 శాతం మంది జాతీయ సంపదలో 40.5 శాతం కలిగి ఉన్నారు. దేశంలోని మొత్తం వస్తువుల, సేవల పన్ను (జీఎస్‌టీ)లో దాదాపు 64% జనాభా దిగువన ఉన్న 50% ప్రజల నుండి వచ్చింది. అయితే 4% మాత్రమే టాప్ 10% నుండి వచ్చినట్లు నివేదిక పేర్కొంది. దేశంలో ఇప్పటికీ ప్రపంచంలో అత్యధికంగా 228.9 మిలియన్ల మంది పేదలు ఉన్నారు. భారతదేశంలోని మొత్తం బిలియనీర్ల సంఖ్య 2020లో 102 నుండి 2022 నాటికి 166కి పెరిగింది. మహమ్మారి నవంబర్ 2022 వరకు ప్రారంభమైనప్పటి నుండి, భారతదేశంలోని బిలియనీర్లు తమ సంపద రోజుకు 121 శాతం లేదా రూ. 3,608 కోట్లకు పెరిగింది. భారతదేశంలోని 100 మంది ధనవంతుల మొత్తం సంపద రూ.54.12 లక్షల కోట్లకు చేరుకుంది. అనగా ఇది మొత్తం కేంద్ర బడ్జెట్‌కు ఒక ఏడాదిన్నర బడ్జెట్‌కు పూర్తి నిధులు అందించగలదు. భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగానే కాదు, అత్యంత అసమాన దేశాలలో కూడా ముందున్న దేశంగా పరిగణిస్తారు. దేశంలోని అట్టడుగు సంపదకు చెందిన వారిలో అత్యధిక శాతం అట్టడుగు వర్గాలకు చెందినవారే కావడం గమనార్హం. భారతదేశంలో ఆరోగ్య వ్యయం భారీగా పెరిగిపోతోంది. వైద్య ఖర్చులు, పాఠశాల విద్యను భరించగలిగే స్తోమత, కుటుంబ సామర్థ్యం లేకుండా పేదరికంలోకి నెట్టేస్తున్నాయి. వనరుల అన్యాయమైన పంపిణీ, సామాజిక, ఆర్థిక అసమానతలు, వారసత్వం ద్వారా సృష్టించబడిన సంపదలో అధిక భాగాన్ని ధనవంతుల చేతుల్లోకి వెళ్లిపోవడం వల్ల బీసీ పేదలు ఇప్పటికీ కనీస వేతనం కూడా సంపాదించలేక పోతున్నారు. దోచి దాచిపెట్టే అవినీతి రాజకీయ వ్యవస్థల ములంగా బీసీల బతుకులు ఆగమాగం అవుతున్నాయి. పెరుగుతున్న ఈ అంతరాలు, అసమానతలు అసహనానికి దారితీసే పెను ప్రమాదం లేకపోలేదు. విద్యా, సామాజిక, ఆర్థిక, రాజకీయ హోదా వంటి అన్ని రంగాలలో బీసీలు అనాదిగా వివక్షకు గురవుతున్నారు. ఈ భారీ వివక్షను తొలగించేందుకు వెనుక బడిన తరగతులకు చట్టసభల్లో రిజర్వేషన్లు కావాలని డిమాండ్ చేయడం అధికారం, హోదాను అనుభవించడం కోసం కాదు. వెనుకబడిన తరగతులు ధనిక ఉన్నత వర్గాలతో పోటీ పడాలని చెప్పడం. సహజ న్యాయం కోసం పోటీ ఇద్దరు సమానుల మధ్య ఉండాలి. అసమానతల మధ్య కాదు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించకపోతే, వారు అభివృద్ధి చెందలేరు. సామాజికంగా, ఆర్థికంగా పురోగమించలేవు. ఆకలితో, పేదరికంతో బాధపడుతున్న వెనుకబడ్డ ప్రజలు, సమాజంలో వారి దీర్ఘకాల సమాన వాటాను కలిగి ఉండటం, జనాభాలో 56% ఉన్న వెనుకబడిన తరగతులు చట్టాల నిర్ణయంలో పాల్గొనడం ఏకైక అంతిమ లక్ష్యం సాధించేందుకు చట్టసభల్లో ప్రాతినిధ్యం చాలా అవసరం. లేకుంటే భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా వెలుగొందాలన్న లక్ష్యం నెరవేరదు.

# సాటిలేని మేటి ఘనాపాఠి భమిడిపాటి



Radhakrishna Bhamidipati

కాలచక్రంతో పాటు గ్రహగతులనూ, జ్యోతిశ్శాస్త్రాన్నీ కూలంకషంగా అధ్యయనం చేసి అక్షరాలకూ, సంఖ్యలకూ బ్రహ్మముడులు వేస్తూ ఒక వ్యక్తి పేరులోంచి వారు పుట్టిన సమయాన్ని వెలికి తీసేందుకు తెలుగు భాషలోని అసంఖ్యాక గుణింతాలతో కూడిన ఒక నిర్దిష్ట సూత్రం రూపొందించి దాని ఆధారంగా జాతకాలను అధ్యయనం చేస్తూ జ్యోతి శ్శాస్త్రంలో ఓ వినూత్న ధోరణిని ప్రవేశపెట్టి ఆ శాస్త్రం విలువను ప్రపంచానికి అందిస్తూ ఎందరికో భవిష్యన్మార్గదర్శకం చేసింది ఒక ఆంధ్రుడేనే విషయం చాలా మందికి తెలియదు.అప్పటి వరకూ అనుసరిస్తున్న గణన పద్ధతిలో ఖచ్చితత్వం సరిగా లేక, లోప భూయిష్టమై, తప్పుల తడకలతో నడకలు సాగిస్తున్న ప్రపంచ కాలచక్ర గతులు సరిచేసే నిమిత్తం 45 బి.సి నుంచి 5,555 ఎ.డి వరకూ ఆంగ్ల క్యాలెండర్‌ను సరిదిద్ది సరికొత్త భమిడిపాటి కేలెండర్‌ను రూపొందించిన మేటి విజ్ఞానవేత్త మన తెలుగుబిడ్డ కావడం అది నిజంగా గర్వకారణ అంశం కాక మరేమిటి? సూర్యుని చుట్టూ భూమి చేసే భ్రమణానికి పట్టే సమయం 365.25 రోజులంటూ ప్రపంచం అప్పటి వరకూ నమ్ముతున్న సూత్రాలను తిరగరాసి, ఈ భ్రమణానికి 365.2422 రోజులు పడుతుందంటూ గణిత సూత్రాల ఆధారంగా ఖచ్చితంగా నిరూపించి నిర్ధారించిన మహా శాస్త్రవేత్త, సాటిలేని జ్యోతిశ్శాస్త్ర మేటి ఘనా పాటి భమిడిపాటి రాధాకృష్ణ. భాషా వ్యాకరణ, ఖగోళ, గణితశాస్త్ర సూత్రాలతో అనుసంధానమై నిర్దిష్ట ఫలితాలను నిక్కచ్చిగా అందించే విజ్ఞాన గని అని నిరూపించి, తన వాస్తవిక దృక్పథాన్ని నిరూపించు కున్న వ్యక్తిత్వం ఆయన సొంతం. రాధాకృష్ణ వ్యాకరణ, ఖగోళ, గణిత శాస్త్రాలను అనుసంధానించి అధ్యయనం చేయడం ద్వారా జ్యోతిశ్శాస్త్ర మూలాలను మర్ధించి అసామాన్య జ్యోతిశ్శాస్త్రవేత్తగా ప్రశంసా పాత్రులైనారు. జ్యోతిశ్శాస్త్రంలో పూర్వం నుంచీ ఉన్న ఆ శాస్త్ర గ్రంథాలైన సారావళి, బృహజ్జాతకం, పరాశర గ్రంథం, జాతక మార్తాండ, జాతక సర్వస్వం, జాతక చంద్రిక, కేరళీయం ఇత్యాది గ్రంథాల్లో నిర్దిష్ట అంశంపై పరస్పర విరుద్ధమైన ఫలితాలు పేర్కొనబడడం రాధాకృష్ణ గమనించారు. అనంతరం వాస్తవిక దక్పథంతో ఈ శాస్త్ర గ్రంథాల నిగ్గు తేల్చేందుకు 40 ఏళ్ల పైబడిన వారికి చెందిన 2,600 జాతకాలు, 72 మంది కవలల జాతకాలు సేకరించి పరిశోధించారు. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇంగ్లీషు కాలెండర్‌లో తప్పు ఉందని రుజువు చేసి, దానిని సరి చేసుకొనే విధానాన్ని సూచిస్తూ 1990లో "ది భమిడిపాటి కేలెండర్"ను ఆంగ్లంలో పుస్తక రూపంలో ప్రచురించారు. జపాన్, లండన్ లాంటి విదేశాల్లో ఈ క్యాలెండర్ విడుదలై, విక్రయించ బడి సంచలనం సష్టించింది. ప్రపంచంలో ఇటువంటి ప్రయత్నం ఇదే తొలిసారి కాగా అయన అపూర్వ కృషి... విజ్ఞులు, విమర్శకుల మన్ననలందుకుంది. ఇది ఆంధ్రులందరికీ గర్వకారణం. తన మరణాన్ని సూచించేలా అన్యాపదేశంగా సెప్టెంబర్ 4వ తేదీన ఈ లోకాన్ని వదులుతానని ముందుగానే తన డైరీలో రాసుకున్న రాధాకృష్ణ రాతలు ఆయన నుదుటి మీద గీతలేనన్న వాస్తవాన్ని ఎవరూ ఊహించ లేకపోవడం గమనార్హం. భమిడిపాటి రాధాకృష్ణ 24-11-1929 వ తేదీన రాజమండ్రిలో జన్మించారు. అక్కడే శ్రీ వీరేశలింగం ఉన్నత పాఠశాల లోను, తరువాత రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి, 1949లో బీ.ఎస్సీ పట్టభద్రు లయ్యారు. తండ్రి శ్రీ కామేశ్వరరావు ఖ్యాతిగాంచిన హాస్య రచయిత కాగా... ఆయన రచనాభిని వేశాన్ని తన జీన్స్‌లోనూ జీర్ణించుకున్నారు రాధాకృష్ణ. భమిడిపాటి రాధాకృష్ణ (నవంబరు 24, 1929 - సెప్టెంబరు 4, 2007) లబ్ధ ప్రతిష్టులైన నాటక, సినీ కథా రచయిత, జ్యోతిష శాస్త్ర పండితుడు, సంఖ్యాశాస్త్ర నిపుణుడు. అయన హాస్య రచయిత. "హాస్య బ్రహ్మ" భమిడిపాటి కామేశ్వరరావు కుమారుడు. రాధాకృష్ణ బహుముఖ ప్రజ్ఞశాలి. ఆయన మొదటి రచన భజంత్రీలు నాటిక. దీన్ని మొదటిసారిగా 25-2-1950 వ తేదీన రాజమండ్రిలో ఆర్ట్స్ కాలెజి పూర్వ విద్యార్థి వార్షికోత్సవ సందర్భంలో ప్రదర్శించారు. అయన 3 నాటకాలు, 6 నాటికలు రచించగా ప్రతీ ఒక్కటీ వెయ్యి ప్రదర్శనలకి పైగా ప్రదర్శింపబడి నాటకరంగ ఖ్యాతిని ఇనుమడింప చేశాయి. అవి కన్నడ, తమిళ, హిందీ భాషల్లోకి అనువాదం అయినాయి. "ఇదేమిటి, కీర్తిశేషులు, మన స్తత్వాలు, భజంత్రీలు, దంత వేదాంతం" వంటి నాటికలు, నాటకాలు వ్రాశారు. రావుగోపాల రావు 'కీర్తిశేషులు' లోని ఒక పాత్ర ధరించడం ద్వారా గుర్తింపు తెచ్చుకుని సినీ పరిశ్రమలోనూ అడుగు పెట్టాడు.28-1-1952న రాజమండ్రిలో జరిగిన సన్మాన సభలో, ఆ సభకి అధ్యక్షత వహించిన శ్రీ అక్కినేని నాగేశ్వర రావు ఆధ్వర్యాన, రాధాకృష్ణకు "దృశ్య కావ్య ధురీణ" అనే గౌరవ పురస్కారం జరిపారు. నిర్మాత దుక్కిపాటి మధుసూదన రావు ప్రోద్బలంతో సినీ రంగంలోకి ప్రవేశించి 150 సినిమాలకు కథలందించారు. ఇందులో కె.విశ్వనాథ్ తొలి చిత్రమైన "ఆత్మగౌరవం" కూడా ఉంది. బ్రహ్మచారి, కథానాయకుడు, కీర్తిశేషులు, మరపురాని కథ, విచిత్ర కుటుంబం, పల్లెటూరి బావ, ఎదురులేని మనిషి, గోవుల గోపన్న, సీతారామ కళ్యాణం, నారీనారీ నడుమ మురారి, కాలేజీ బుల్లోడు వంటి వాటితో సహా తెలుగు పలు చిత్రాలకు కథలు వ్రాశారు. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు ఆయన సన్నిహితులు. 1994 తర్వాత క్రమంగా ఆయన సినిమా రంగానికి దూరమయ్యారు. తనకు ఎంతో ఇష్టమైన గణిత రంగంపై మక్కువ చూపారు. భమిడిపాటి రాధాకృష్ణ క్యాలెండర్ పేరిట క్రీస్తుపూర్వం 45 నుంచి క్రీస్తుశకం 5555 వరకు అంటే ఆరు వేల సంవత్సరాల క్యాలెండర్ రూపొందించారు. జ్యోతిష రంగంలో కూడా ఆయనకు పట్టు ఉంది. సంఖ్యాశాస్త్ర పరంగానే కాకుండా చిన్నారుల నామకరణ సమయంలో బియ్యంలో రాసే అక్షరాలను బట్టి కూడా ఆయన జాతకాలు చెబుతారనే పేరు సంపాదించు కున్నారు. ఆయన 79 సంవత్సరాల వయస్సులో రాజమండ్రిలో మరణించారు. భజంత్రీలు, దంత వేదాంతంబీ కీర్తిశేషులుబీ మన స్థత్వాలుబీ తరం-అంతరంబీ తదితర నాటకాలను ఆయన రచించారు. ఆత్మ గౌరవం (1965) (డైలాగ్స్ రచయిత)బీ మరపురాని కథ (1967)బీ కథానాయకుడు (1969)బీ అల్లుడే మేనల్లుడు (1970)బీ ఆడ జన్మ (1970)బీ బొమ్మా బొరుసా (1971)బీ రామ రాజ్యం (1973)బీ ఆడపిల్లల తండ్రి (1974)బీ అల్లుడొచ్చాడు (1976)బీ పొగరు బోతు (1976)బీ మనిషి రోడ్డున పడ్డాడు (1976)బీసాహస వంతుడు (1978)బీ షోకిల్లా రాయుడు (1979)బీ నారి నారి నడుమ మురారి తదితర చిత్రాలకు సంభాషణలు రాశారు.

# పత్రికల పంపిణీలో పేపర్ బాయ్స్ సేవలు



ఆధునిక సమాజంలో ప్రింట్ మీడియా కన్నా సోషల్ మీడియా వేగవంతంగా ముందుకు సాగుతోంది. స్మార్ట్ ఫోన్‌లు అందుబాటులోకి వచ్చాక డిజిటల్ యుగంలో సామాజిక, డిజిటల్ మాధ్యమాల ప్రభావం నానాటికీ పెరిగిపోతోంది. అప్డేట్స్‌తో వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ మాధ్యమాల ద్వారా విషయం వెనువెంటనే బహిరంగం అవుతుండగా, ప్రింట్ మీడియా వాటి వేగానికి, టెక్నిక్స్‌కు పోటీ పడలేక పోతోంది. లైవ్ వీడియోలతో వస్తున్న అంశాలు, బ్రేకింగ్ న్యూస్ కోసం అధిక సంఖ్యాకులు ప్రభావితులు అవుతున్నారన్నది వాస్తవం. నేటి వార్త తెల్లవారి మార్కెట్ లోకి ప్రచురితం అయి వచ్చే సాంప్రదాయ పత్రికల కోసం చాలామంది ఎదిరి చూసే పరిస్థితులు కనిపించడం బాధాకరం. ఒకనాడు నిత్యం ప్రపంచంలో ఏ మూల ఏమి జరిగినా ప్రజలకు వార్తా పత్రికలు మాత్రమే చెరవేసేవి.ప్రభుత్వాలకు ప్రజలకు మధ్యవర్తిత్వం వహిస్తూ వారథులుగా పత్రికలు పని చేసేవి. ప్రజా బాహుళ్యానికి నిత్యం చైతన్య పరుస్తూ, ప్రగతికి బాటలు వేసేవి. ఇప్పటికీ కొన్ని ఆ పనులు చేస్తూనే ఉన్నాయి. గతంలో దిన, వార, పక్ష, మాస, ద్వైమాసిక, పత్రికలు.. .సాహిత్య, విద్య, ఉపాధి, పరిశోధన, సినిమా, హాస్య, విజ్ఞాన, ఆధ్యాత్మిక పత్రికలు... చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు లాంటి పిల్లల పత్రికలు వివిధ రకాలుగా అలరించేవి. దిన పత్రికలు ప్రాచుర్యాన్ని పొందాక, సమాచార వ్యవస్థ అంతంత మాత్రమే ఉన్న నాటి రోజుల్లో నేటి పేపర్ రేపు, ఉదయం రావాల్సిన పత్రికలు మధ్యాహ్నం పాఠకుల చేతికి చేరేవి. అయితే వేగవంతంగా పాఠకుని గుమ్మానికి పత్రికలను చేర్చేందుకు విప్లవాత్మక మార్పులు తెచ్చి, ప్రచురణ కేంద్రాలను పెంచుకుని, సర్క్యులేషన్లను త్వరితం చేసుకున్నాయి. అలాంటి స్థితిలో పత్రికలు పాఠకునికి చేర్చడంలో కీలక పాత్ర పోషించింది నిస్సందేహంగా పేపర్ బాయ్. తొలి పేపర్ బాయ్‌గా గుర్తింపు పొందిన బార్నీ ప్లాహెర్టీ జయంతిని పురస్కరించుకొని ప్రతి ఏటా సెప్టెంబరు 4న అంతర్జాతీయ పేపర్‌బాయ్ దినోత్సవం జరుపుతున్నారు. నియమిత స్థలాల్లో పాత్రికేయులు ఆహరహం శ్రమించి, సేకరించి పంపిన వార్తలను ఉప సంపాదకులు సరిచేసి, సంపాదకుని ఆమోద ముద్ర పడిన తర్వాత ముద్రణకు రంగం సిద్ధం చేశాక, ముద్రిత దిన పత్రికలను పాఠకులకు చేరవేయడం లో పేపర్‌బాయ్‌ల కష్టాలు, ఇబ్బందులు అందరికీ తెలిసిందే. నిర్ణీత ప్రదేశాలలో పంపిణీ వాహనాల కోసం అర్ధ రాత్రి దాటి నప్పటి నుంచి ఎదిరి చూస్తూ, అందుకున్న కట్టలు విప్పి, సెట్లుగా అమర్చుకుని, ఇళ్ళల్లో చందాదారులు, కొనుగోలుదారులు నిద్రలేచి, లేవక ముందే నడిచి లేదా సైకిల్‌పై వెళ్లి గడప గడపకు ఆగి, ముంగిళ్ళలో వేసి, తలుపుల బిడియాలకు చెక్కి పై అంతస్థులో ఉంటే ఎగురవేత ద్వారా వేసిన, వేస్తున్న విషయాలు నిత్య జ్ఞాపకాలే. స్వాతంత్రోద్యమ సమయంలో లోకమాన్యుడు బాలగంగాధర్ తిలక్ పీపుల్స్‌వార్ పత్రికకు కొన్నాళ్లపాటు పేపర్ బాయ్‌గా పనిచేశారు. అలాగే ప్రఖ్యాత శాస్త్రవేత్త, దివంగత భారత రాష్ట్రపతిగా పనిచేసిన డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విద్యార్థి దశలో పేపర్ బాయ్‌గా పని చేయడం, జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత రాపూరి భరద్వాజ, తెలంగాణ తొలి బి సి కమిషన్ ఛైర్మెన్, ప్రముఖ తత్వవేత్త, శతాధిక గ్రంథ రచయిత బి ఎస్ రాములుగా చిర పరిచుతులైన బేతి శ్రీరాములు పేపర్ ఏజెంటుగా, బాయ్‌గా ఇలా గొప్పవారు పేపర్‌బాయ్‌లుగా పనిచేసిన వారే అన్న విషయం తెలుసు కోవాలి. అమెరికా లాంటి దేశాలలో వృత్తిపరంగా పెద్ద ఉద్యోగాలు చేస్తున్నా, నామోషీ గా భావించక వివిధ కారణాలతో కొందరు దిన పత్రికలు పంచడం చేస్తుండడం విశేషం. పేపర్ బాయ్ పేరుతో జయశంకర్ దర్శకత్వం వహించిన, భీమ్స్ సిసిరొలియో సంగీతం అందించిన...సంతోష్ శోభన్, రియా సుమన్ తాన్యా హోప్, పోసాని కృష్ణ మురళి, అన్నపూర్ణ, బిత్తిరి సత్తి, విద్యుల్లేఖ రామన్, కల్పలత, సన్నీ, అభిషేక్ మహర్షి, మహేష్ విట్ట తదితర తారాగణం నటించిన ఒక తెలుగు చలన చిత్రం 2018, ఆగష్టు 31న విడుదల కావడం గమనార్హం. వాస్తవానికి ప్రింట్ మీడియా ఇంకా ఎన్నో రకాల ప్రయోజనాలను కల్పిస్తునే ఉంది. అమెరికా, కెనడా వంటి అనేక దేశాలు తమ ప్రకటనల వాహకాలుగా ప్రింట్ మీడియాపై ఎక్కువగా ఆధారపడు తున్నాయనే విషయం మరిచి పోలేనిది. ప్రభుత్వాలు కూడా చిన్న పెద్ద పత్రికలకు చేయూతను అందిస్తున్నాయి. పాత్రికేయులకు ఇళ్ళ స్థలాలు, ఆరోగ్య వైద్య సదుపాయాలు, ప్రయాణ టిక్కెట్ టికెట్ల రాయితీ గల బస్ పాస్ లు, వివిధ రకాల యాడ్స్ తదితరాలతో ప్రోత్సాహాలను అందించడం జరుగుతున్నది. అలాగే చదువుకోసం, ఆర్థిక స్వావలంబన కోసం, జీవనోపాధి కోసం చాలామంది చాలా పత్రికలకు పేపర్ బాయ్స్ గా పనిచేస్తున్న వారిని ప్రభుత్వాలు, యాజమాన్యాలు గుర్తించాల్సిన అవసరం ఉంది. చేస్తున్న పని చిన్నదా పెద్దదా అన్నది కాకుండా, వారి సేవలను గుర్తించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

## సమగ్ర కులగణనను ప్రారంభించాలి

తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కామారెడ్డి డిక్లరేషన్ ద్వారా అధికారంలోకి రాగానే ఓబీసీ రిజర్వేషన్లను 23 నుంచి 42 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చింది. ఆ హామీ నిలబెట్టుకునే సమయం వచ్చింది. సమగ్ర కులగణన వెంటనే ప్రారంభించి బీసీ రిజ్వేషన్లను 42% పెంచాలి. తెలంగాణలో కొత్తగా బీసీ కమిషన్ పేరిట ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలో కులగణన లేకుండా, రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగితే మాత్రం ప్రజలు ఒప్పుకునే పరిస్థితిలో లేరని గుర్తించాలి. బీసీల సామాజిక, విద్య, ఆర్థిక, రాజకీయ ఎదుగుదలకు కులగణన ఓ గొప్ప అవకాశంగా మారాలి. ఓబీసీ కులాల లెక్కలు లేకపోవడం వలన అనేక సార్లు బీసీలకు ఎంతో అన్యాయం జరుగుతూ ఉంది. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల కంటూ ఓ క్లారిటీ వస్తుంది. కులాలవారీగా జనాభా లెక్కలు ఉన్నప్పుడే అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందించే వీలు ఏర్పడుతుంది. బీసీ కులాలను ఉప కులాలుగా విభజించటం వీలవుతుంది. క్రిమిలేయర్‌ను కూడా సమర్థవంతంగా అమలుచేసే అవకాశం ఉంటుంది. కులజనగణన వలన మాత్రమే ఓబీసీ కులాలకు సమానత్వం, సామాజిక న్యాయం అందుతాయి. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచవ చ్చు. కులగణన ఈ దేశానికి ఒక దశ, దిశను నిర్దేశిస్తుంది. గత కొన్ని సంవత్సరాలుగా బీసీలు, బీసీ బిల్లు కోసం ఉద్యమిస్తుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కనీసం పట్టించుకోవడం లేదు. బీసీ అట్రాసిటీ చట్టం కూడా తీసుకుని వచ్చి బీసీలకు రక్షణ కల్పించాలి. కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనగణనలో బీసీ జనగణన చేపట్టాలి. పంచాయతీరాజ్ వ్యవస్థలో రిజర్వేషన్లను 52 శాతం పెంచాలి. దీనిపై బీసీలంతా ఏకతాటిపై వచ్చి ఉద్యమించేలా జాతీయ బీసీ దళ్ కార్యాచరణను సిద్ధం చేసింది.

# భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆర్డీవోలు, తహసిల్దార్‌లతో వీడియో కాన్ఫరెన్స్





రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, సెప్టెంబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇండ్ల, పూర్తిగా నష్టం జరిగిన ఇండ్ల వివరాలను సేకరించుట పై, చెరువుల ఫైనల్ నోటిఫికేషన్ జారీ చేయుటపై మంగళవారం జిల్లా కలెక్టర్ శశాంక ఆర్డీఓలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల కారణంగా జిల్లాలో దాదాపు 40 ఇండ్లు పాక్షికంగా, రెండు ఇండ్లు పూర్తిగా ధ్వంసమైనట్లు గుర్తించామని, వీటికి సంబంధించి ఏ మేరకు నష్టం వాటిల్లిన వివరాలను వెంటనే సమర్పించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. పాక్షికంగా, పూర్తిగా ధ్వంసమైన ఇండ్ల నష్టపరిహారనికి సంబంధించిన నివేదికలు వెంటనే కలెక్టరేట్ కు సమర్పించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమిష్టిగా నాలాల పరిసరాలను పరిశీలించి, తగు జాగ్రత్తలు తీసుకునే విధంగా అధికారులు చొరవ చూపాలని అన్నారు. ఆర్డీఓలు, తహశీల్దార్లు తమ పరిధిలోని ఏదైన విలువగల ప్రభుత్వ భూమి ఉన్నట్లయితే వెంటనే వాటికి కంచె వేయుటకు చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని 100 చెరువులకు ప్రిలిమినరీ నోటిఫికేషన్ పెండింగ్ లో ఉన్నాయని, ఇప్పటి వరకు 925 చెరువులలో 99 చెరువులకు మాత్రమే ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 820 చెరువులకు ఫైనల్ నోటిఫికేషన్ పూర్తి చేయవలసి ఉన్నదని, వీటిని త్వరితగతిన పూర్తి చేయడానికి వారానికి 30 నుండి 40 చెరువులను సర్వే నిర్వహిస్తే సకాలంలో పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో కోర్టు కేసులకు సంబంధించి ఆయా కోర్టులలో అధికారులు వెంటనే తగిన సమాచారం అందించి స్పందించాలని, వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్ లో లాండ్ ప్రొటెక్షన్ అధికారి కె.ఎస్.బి. కుమారి, మండలాల నుండి తహశీల్దార్లు, ఆర్డీఓలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదుకుంటాం.. అండగా ఉంటాం

కష్టంలో తోడుగా.. కన్నీళ్లలో అండగా

వరద బాధితులను నేరుగా కలిసి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**దేవరకొండ, సెప్టెంబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి** డిండిమండల పరిధిలోని గోనబోయినపల్లి గ్రామానికి చెందిన పలువురు చేపలు పట్టటానికి వెళ్లి సిద్దాపూర్ శివారులోని రాతి బండపై ఉంటున్న చిన్నపిల్లలతో సహా 10 మంది చెంచులు వరద మధ్యలో చిక్కుకున్న విషయం తెలుసుకొని వారి క్షేమ సమాచారాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వాగులో చిక్కుకున్న వారిని బయటకు తీసుకువచ్చేందుకు స్వయంగా రంగంలోకి దిగి,గజ ఈతగాళ్ల సహాయంతో వాగులో చిక్కుకున్న వారిని రక్షించేందుకు నేడు ఉదయం 7:00గంటలకు సిద్దాపురం సమీపంలోని డిండి వాగు వద్దకు చేరుకొని వరద బాధితులను నేరుగా కలిసి ప్రభుత్వం అండగా ఉంటుందని సహచార ఎమ్మెల్యే వంశీ కృష్ణ తో కలిసి భరోసా కల్పించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. భారీ వర్షాలు, వరదల కారణంగా మరణించిన వ్యక్తుల కుటుంబాలకు అందించే ఎక్స్ గ్రేషియాను రూ. 4 లక్షల నుంచి రూ.5 లక్షలకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. వర్షాలు, వరదల కారణంగా పూర్తిగా దెబ్బతిన్న పంటలకు ఒక్కో ఎకరానికి రూ. 10 వేల చొప్పున పంట నష్ట పరిహారం అందించేందుకు తక్షణ ఏర్పాట్లు చేయలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని ఆదేశించారు అని అన్నారు. అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, వెంటనే క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని చెప్పారు. ప్రజలకు నిత్యావసర వస్తువుల పంపిణీ, సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని అన్నారు.భారీ వర్షాలు,వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని విభాగాల నుంచి ప్రాథమిక నివేదికలు తెప్పించి,బాధితులను ఆదుకోవాలి అని అన్నారు. గత మూడు రోజులుగా భారీ వర్షాలతో అతలాకుతలమై ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సహాయక చర్యల్లో నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను ఆదేశించారు.పేదలను ఆదుకోవడంలో ఎక్కడ రాజీ పడబోమని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు,డిండి మాజీ సర్పంచ్ శైలేష్,గడ్డమీది సాయి,మేకల కాసన్న,బద్దెల శ్రీను,శ్రీనివాస్ గౌడ్, సాయి బాబా, ఖలీమ్,పోలీస్ శాఖ యంత్రాంగం, రెవెన్యూ శాఖ యంత్రాంగం,అచ్చంపేట పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు నాయకులు వివిధ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గురు నానక్ యూనివర్సిటీలో 3వ హెచ్‌ఆర్ కాన్క్లేవ్








**ఇబ్రహీంపట్నం, సెప్టెంబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని గురు నానక్ యూనివర్సిటీ క్యాంపస్ లో ఈరోజు బహుళజాతి కంపెనీల హెచ్ ఆర్ ప్రతినిధులతో ప్రతిష్టాత్మకంగా 3 వ హెచ్ ఆర్ (హ్యూమన్ రిసోర్స్ కాన్క్లేవ్) కాంక్లేవ్ ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం సవాళ్లను ప్రతికూల వాతావరణం లో అవకాశాలుగా మార్చుకొని కెరీర్ సక్సెస్ కోసం ఫ్రెషర్స్ మరియు గ్రాడ్యుయేట్లు కాబోతున్న విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ ఎదురయ్యే సవాళ్ళను అధిగమిస్తూ ఐ టి రంగంలో నిలదొక్కుకొని తమను తాము నిరూపించుకొంటూ భవిష్యత్తులో ఎలా ముందుకు వెళ్లాలనే అంశంపై (ఫ్రెషెర్బోట్ ఇనిషియేటివ్) దేశంలోని ప్రఖ్యాత కంపనీల హెచ్ ఆర్ ల ఆధ్వర్యంలో కళాశాల యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో దేశంలోని విచేసినటువం బహులజాతి కంపెనీల హెచ్ ఆర్ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు తమ అనుభవంతో కూడిన అంశాలను మరియు ఉద్యోగాన్ని పొందడమే కాకుండా ఉద్యోగ కల్పనలు చేసేవిధంగా విద్యార్థులకు సలహాలు సూచనలు చేసారు.

శ్రీ. వినయ్ పుర్వాలా, డైరెక్టర్ – %ఎ=%, డైబోల్డ్ నిక్స్‌డార్ఫ్, యాంప్లెలాజిక్ యొక్క హెచ్‌ఆర్ మేనేజర్ ప్రీతి గడిలా, శ్రీ. ఉదయ్ కిరణ్ మేనేజర్ టాలెంట్ అక్విజిషన్, ఎన్విరి గ్లోబల్, శ్రీమతి. కవిత, వైస్ ప్రెసిడెంట్ – %ఎ=ద్రూ, జు=ూూ ఙుఖ్ణుఎవత్‌వతీం% ల్టీడ్, శ్రీమతి. తనుశ్రీ దాస్, సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్, %ూ=వీ%360, కెరీర్ డెవలప్‌మెంట్‌లో నెట్‌వర్కింగ్ మరియు మెంటర్‌షిప్ ప్రాముఖ్యతపై మాట్లాడారు.

శ్రీమతి. పల్లవి బొర్రా, అసిస్టెంట్ హెచ్‌ఆర్ మేనేజర్, %ూ×దీతీఅఎన్త్రవ మీూ% టెక్నాలజీస్,

శ్రీ. సుధీర్ సుగురు, సీనియర్ హెచ్ ఆర్ మరియు ఫ్రెషెర్బోట్ వ్యవస్థాపకుడు శ్రీ కృష్ణ తేజ మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన కార్పొరేషన్‌లతో ఉపాధిని పొందేందుకు కొనసాగుతున్న ఎంగేజ్‌మెంట్‌ల ద్వారా విద్యార్థులు తమ బలాన్ని గుర్తించడంలో తమ కంపెనీ ఎలా సహాయపడుతుందో వివరించారు.

ఈ కార్యక్రమంలో గురునానక్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ మరియు గురు నానక్ యూనివర్సిటీ ఛాన్సలర్ అయినటువంటి శ్రీ గగన్‌దీప్ సింగ్ కోహ్లీ మాట్లాడుతూ, ముందుగా కళాశాలకు విచేసినటువంటి బహుళజాతి కంపనీలకు సంబందించిన హెచ్ ఆర్ ప్రతినిధులకు గౌరవ సన్మానం చేసి వారికి ధన్యవాధాలు తెలుపుతూ అందుకు కృషిచేసిన కళాశాల ప్లేసెమెంట్ డిపార్ట్మెంట్ వారిని అభినందిస్తూ , స్పష్టమైన రోడ్ మ్యాప్‌ను రూపొందించడానికి తరచుగా సమావేశాల ద్వారా కార్పొరేట్ ప్రపంచానికి వారిని బహిర్గతం చేయడం ద్వారా విశ్వవిద్యాలయం తమ విద్యార్థులకు ప్రత్యేకమైన ప్రయోజనాన్ని అందించాలని లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. గురునానక్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, డాక్టర్ హెచ్.ఎస్. సైనీ మాట్లాడుతూ, ఈ హెచ్‌ఆర్ కాన్క్లేవ్ విద్యార్థులకు వ్యూహాలను అభివృద్ధి చేయడంలో మరియు వారిలోని మల్టీ స్కిల్స్ అభివృద్ధి చేయడంలో సహాయపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ముఖ్య కో ఆర్డినేటర్ శ్రీ వినయ్ చోప్రా, డైరెక్టర్ కార్పొరేట్ రిలేషన్స్ మరియు విద్యాసంస్థల డైరెక్టర్లు డాక్టర్ ఎస్ శ్రీనాథ రెడ్డి, డాక్టర్ సంజీవ్ శ్రీవాస్తవ ప్రిన్సిపాల్ డాక్టర్ కె వెంకట రావు, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పీ పార్థసారథీ మరియు సంబంధిత విభాగ అధిపతులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ, సెప్టెంబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి** డిండి ప్రాజెక్టు నుండి చందంపేట,నేరేడు గొమ్ము, దేవరకొండ మండలలాల్లో ఉన్న కుంటలను నింపడానికి నేడు డిండి మండల పరిధిలోని కామేపల్లి గ్రామం వద్ద కాల్వ ద్వారా నీటిని విడుదల చేసిన దేవరకొండ శాసన సభ్యులు నేనావత్ బాలు నాయక్. రుణమాఫీ చేసి రైతులకు అండగా నిలిచామని, వ్యవసాయాన్ని పండుగల మారుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి త్వరగా ఇచ్చి ఇండ్ల నిర్మాణాలు చేపడతాం

అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసి ఇండ్ల నిర్మాణం చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే బాలు నాయక్



**దేవరకొండ, సెప్టెంబర్ 3 ాసనసభ న్యూస్ ప్రతినిధి** చందంపేట మండల పరిధిలోని నక్కలగండి ప్రాజెక్టునకు ముంపుకు గురవుతున్న నక్కలగండి తండా, కేశ్య తండా గ్రామాలు గత రెండు రోజులుగా ప్రవహిస్తున్న డిండి వాగువల్ల నష్టపోయిన పంటలను మరియు ఇండ్లను సందర్శించి వారి సమస్యలను అడిగి తెలుసుకొని నిర్వాసితుల కుటుంబాలను పూర్తిస్థాయిలో ఆదుకుంటామని హామీ ఇచ్చిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఇక్కడే నివాసం ఉంటూ భూములు సాగు చేస్తూ ప్రస్తుతం ముంపు ద్వారా నష్టం వాటిల్లిన పంటలను వివరాలను వ్యవసాయ అధికారుల ద్వారా పరిశీలన చేయించి నష్ట పరిహారం అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బద్య నాయక్,మాజి ఎంపీపీలు పార్వతి చందు నాయక్, గోవింద్,ముత్యాల సర్వయ్య, మాజీ జెడ్పిటిసి బుజ్జి లచ్చిరామ్ నాయక్,యువజన కాంగ్రెస్ నియోజక వర్గ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, పిఎసిఎస్ చైర్మన్ శ్రీశైలం యాదవ్, డిండి మండల బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతినేని వెంకటేశ్వర్ రావు,మాజి మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు భరత్,రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇరిగేషన్ శాఖ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం



**దేవరకొండ, సెప్టెంబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** బారి వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని నేడు దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఇరిగేషన్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. భారీ వర్షాలతో ప్రాజెక్టుల్లోకి వచ్చిన వరద నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేలా అవసరమైన చర్యలు చేపట్టాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఇరిగేషన్ శాఖ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల పరిధిలోని కాల్వల ద్వారా చెరువులు కుంటల్లో నీటిని నిల్వ చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలోఎఈ శ్రీదర్ రావు,డీఈలు శ్రీనివాస్, మనోహర్ ఏఈ లు పాల్గొన్నారు.


## వినాయక చవితి నిర్వాహకులు తప్పకుండా ఆన్లైన్ లో పర్మిషన్ తీసుకోవాలని..




**దేవరకొండ, సెప్టెంబర్ 3 శాసనసభ న్యూస్ ప్రతినిధి:** గుడిపల్లి పోలీస్ స్టేషన్లో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిర్వహణదారులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి మంగళవారం సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. వినాయక చవితి నిర్వాహకులు తప్పకుండా ఆన్లైన్ లో పర్మిషన్ తీసుకోవాలని అదేవిధంగా గణేష్ మండపాలలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగినది.

## బిజినెస్

# సెబీ చీఫ్‌కు ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి రూ.16.80 కోట్ల జీతం!



సెబీ చీఫ్ మాధబి పూరి బుచ్ పై కాంగ్రెస్ సోమవారం పలు ఆరోపణలు చేసింది. మాధబి 2017 నుంచి 2021 వరకు సెబీలో పూర్తికాల సభ్యురాలిగా ఉన్నారని కాంగ్రెస్ పేర్కొంది. 2022లో ఆమె ఛైర్‌పర్సన్ అయ్యారు. 2017 నుంచి 2024 మధ్య మాధవి ఐసీఐసీఐ బ్యాంకు నుంచి రూ.16.80 కోట్ల జీతం తీసుకున్నారని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేడా విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కాలంలో మాధబి సెబితోపాటు ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి కూడా జీతం తీసుకున్నారని ఆరోపించారు. ఇది ప్రయోజనాల పరస్పర విరుద్ధమైన అంశమని కాంగ్రెస్ పేర్కొంది. కాంగ్రెస్ చేస్తున్న ఈ ఆరోపణలపై మాదబి నుంచి ఇంకా ఎలాంటి స్పందన లేదు. ఈ సందర్భంగా సెబీ నిజాయితీపై పవన్ ఖేరా ప్రశ్నలు లేవనెత్తారు. మార్కెట్ రెగ్యులేటర్ నిష్పాక్షికతను, స్వతంత్రతను కొనసాగించాలన్నారు. సెబి చీఫ్ ఐసిఐసిఐ బ్యాంక్ వంటి ప్రైవేట్ సంస్థ నుంచి జీతం పొందుతున్నప్పుడు సెబి నిష్పాక్షికతను ఎలా నిర్ధారించగలరని ఖేడా ప్రశించారు? సెబీపై 'బాహ్య ప్రభావం' లేదని నిర్ధారించడానికి ఈ విషయాన్ని దర్యాప్తు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికాకు చెందిన షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్‌బర్గ్ రీసెర్చ్.. గతంలో సెబీ చైర్ పర్సన్ మాధబి పురి బచ్ పై సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువలు కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషన్ ఫండ్ లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలు ఉన్నాయని ఆరోపించింది. ఈ మేరకు విజిల్ బ్లోయర్ నుంచి తమకు సమాచారం అందిందని హిండెన్ బర్గ్ పేర్కొంది.

## విశాఖలో సరికొత్త టీవీఎస్ జుపిటర్ 110 ఆవిష్కరణ




ద్విచక్ర, త్రిచక్ర వాహనాల విభాగంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన టీవీఎస్ మోటర్స్ తన సరికొత్త టీవీఎస్ జుపిటర్ 110 వాహనాన్ని సోమవారం ఉద యం విశాఖపట్నం నోవాటెల్ హెూటల్ లో ఆవిష్కరించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి వైభవ్ శేఖర్ మాట్లాడుతూ టీవీఎస్ జుపిటర్ దేశవ్యాప్తంగా గా 65 లక్షల మంది వినియోగదారులను కలిగివుందని, తమ వినియోగదారులకు మరింత సౌకర్యాన్ని అందించేందుకు టీవీఎస్ జుపిటర్ 110 వాహనాన్ని విడుదల చేశామని తెలిపారు. ఈ వాహనం శక్తివంతమైన 113.3 సీసీ, సింగిల్ సిలిండర్, 4 స్ట్రోక్ ఇంజన్ కలిగి ఉందని, మునుపటి వెర్షన్తో పోలిస్తే పది శాతం అధికమైన మైలేజీ టెక్నాలజీతో పొందుపరచబడినది తెలిపారు. ఈ నూతన వాహనం విశాలవంతమైన, గ్లౌస్ బాక్స్, ఫ్రంట్ ఫ్యూయల్ ఫీల్, పొడవైన సీటు, వన్ ఇన్ లాక్, యూఎస్బీ మొబైల్ చార్జర్, పేటెంట్ పొందిన ఈ జెడ్ సెంటర్ స్టాండ్ మొదలైన సౌకర్యాలు కలిగి ఉందని అలాగే సౌకర్యవంతమైన ప్రయాణానికి మోటార్ సైకిల్ తరహాలో ఫ్రెంట్ టెలిస్కోపిక్ సస్పెన్షన్ ఇవ్వడం జరిగిందని ఆయన తెలిపారు అంతేకాకుండా బాడీ బ్యాలెన్స్ టెక్నాలజీ 2.0 తో ఈ వాహనం పొందుపరచబడిందని ఆయన అన్నారు. ఈ వాహనం మెటల్ ఫీల్ ట్యాంక్ తో పాటు సైడ్ ప్యానల్స్, రెండు హెల్మెట్లు పట్టే డ్యూయల్ హెల్మెట్ స్పేస్ , ఎమర్జెన్సీ బ్రేక్ వార్నింగ్, టర్న్ సిగ్నల్ ల్యాంప్ రీసెట్ సౌకర్యాలతో పాటు ఆరు విభిన్న రంగులలో లభ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్లో దీని ప్రారంభ షోరూం ధర రూ.77,200 ప్రారంభమవుతుందని, అన్ని టీవీఎస్ షో రూమ్లలో నేటి నుండి అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

## రెండు కార్లపై ధర తగ్గించిన మారుతి




మారుతి కార్లకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంటుంది. సామాన్యుల నుంచి ఖరీదైన కార్లు కొనే వారి వరకు వివిధ మోడళ్లను మార్కెట్లోకి తీసుకొస్తుంది. మారుతి కంపెనీకి చెందిన కార్లలోని ఫీచర్లు ప్రీమియం కార్లను తలపిసా ్తయి. అందుకే వ్యాగన్ఆర్, స్విఫ్ట్ వంటివాటికి ఇప్పటికీ ఇప్పటికీ డిమాండ్ తగ్గడం లేదు. కొన్ని సార్లు మారుతి కార్ల సేల్స్ తక్కువగా అయ్యే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో వినియోగదారులను ఆకర్షించేందుకు ఆఫర్లు ప్రకటిస్తారు. ఇప్పుడు మారుతి కంపెనీ కూడా రెండు మోడళ్లకు ధరను తగ్గించింది. ఇవి ఇప్పటికే మార్కెట్లో ఉన్నప్పటికీ వీటి కొనుగోళ్లను పెంచేందుకు లేటేస్ట్ గా నిర్ణయం తీసుకుంది. ఇంతకీ మారుతికి చెందిన ఏ కార్ల ధరలు తగ్గాయి? వాటి ఫీచర్లు ఎలా ఉన్నాయి? హ్యాచ్ బ్యాక్ వేరియంట్లను ఎక్కువగా విక్రయించడం మారుతి కంపెనీకే సాధ్యమవుతుంది. అయితే ఈ కంపెనీకి చెందిన కొన్ని కార్ల అమ్మకాలు క్షీణించాయి. ఈ నేపథ్యంలో మారుతికి చెందిన ఆల్టో కే 10, ఎస్ ప్రెస్సో మోడళ్లపై వరుగా రూ.6,500, రూ.2,000 తక్కువధరతో విక్రయిస్తోంది. చిన్న ఫ్యామిలీకి అనుగుణంగా ఉండే ఈ కార్లలు 5గురు ప్రయాణం చేయొచ్చు. అంతేకాకుండా లో బడ్జెట్ కు అనుగుణంగా ఉన్న ఈ కార్ల ఎలా ఉన్నాయంటే? మారుతి కంపెనీ నుంచి లో బడ్జెట్ లో ఎక్కువ మైలేజ్ ఇచ్చే కారు ఏదంటే ముందుగా ఆల్టో కే 10 గురించే చెబుతూ ఉంటారు. ఇందులో 1.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్ తో పాటు సీఎన్ జీ ఆప్షన్ కూడా ఉంది. సీఎన్ జీ వేరియంట్లలో 33.85 కిలోమీటర్ల మైలేజ్ ఇస్తుంది. ఇందులో యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ తో పాటు సేఫ్టీ కోసం ఎయిర్ బ్యాగులు ఉన్నాయి.

## రూ.3,307 కోట్లతో కేనెస్ సెమీ కండక్టర్ ప్లాంటు




గుజరాత్‌లోని సనంద్‌లో కేనెస్ రూ.3,307 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయాలనుకున్న సెమీ కండక్టర్ ప్లాంట్ ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్‌లో రోజుకు 63 లక్షల చిప్‌లు తయారు చేసే సామర్థ్యం ఉంటుందని ఐటీ మంత్రి అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. 'సనంద్‌లో 46 ఎకరాల్లో కేనెస్ భారీ ప్లాంట్ ఏర్పాటుకు సోమవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇక్కడ ఉత్పత్తి చేసే చిప్‌ల్లో అధిక భాగం కేనెస్ ఇండస్ట్రీస్‌కు వెళతాయి' అని మంత్రి పేర్కొన్నారు. విద్యుత్ రంగానికి సంబంధించిన చిప్‌లను కూడా ఈ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు కోసం ఇప్పటికే సనంద్‌లో కంపెనీ భూసేకరణ చేసింది. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించనుంది. వాహనాలు, గృహోపకరణాల్లో వినియోగించే చిప్‌లను కూడా ఈ ప్లాంట్‌లో తయారు చేయనున్నారు. టాటా ప్లాంట్‌కు భూ సేకరణ పూర్తి: తైవాన్‌కు చెందిన పవర్‌చిప్ సెమీకండక్టర్ మ్యానుఫ్యాక్చరింగ్ కార్ప్ (పీఎస్ఎంసీ) భాగస్వామ్యంతో టాటా ఎలక్ట్రానిక్స్ సెమీకండక్టర్ ఫ్యాబ్‌ను ధోలేరాలో ఏర్పాటు చేస్తున్న సంగతి విదితమే. రూ.91,000 కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ నిర్మాణం కోసం ఇప్పటికే భూసేకరణ పూర్తయిందని తెలిపారు. లాజిక్, మెమొరీ ఫౌండ్రీ విభాగాల్లో అనుభవం కలిగిన పీఎస్ఎంసీకి తైవాన్‌లో 6 సెమీకండక్టర్ ఫౌండ్రీస్ ఉన్నాయి. 'సెమీకండక్టర్లకు కేంద్రంగా మారేందుకు మన దేశం చేస్తున్న ప్రయత్నాలకు మరొక ప్రోత్సాహం లభించింది. సనంద్‌లో ఏర్పాటు చేయనున్న ఈ ప్లాంట్ అనేక రంగాలకు సేవలు అందించడమే కాకుండా, యువతకు ఉపాధి కల్పిస్తుంద'ని ప్రధాని నరేంద్ర మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

## కోకాకోలాను కొనుగోలు చేయనున్న డాబర్..

డాబర్ గ్రూప్ తన వ్యాపార విస్తరణపై దృష్టి సారిస్తోంది. కోకాకోలాలో ప్రధాన వాటాను కొనుగోలు చేసేందుకు కంపెనీ దృష్టి సారిస్తోంది. డాబర్ బర్మన్ కుటుంబం, జూబిలెంట్ గ్రూప్ ప్రమోటర్లు భారతియా హిందు స్థాన్ కోకా-కోలా బెవరేజెస్‌లో 40శాతం వాటాను రూ. 10,800-12,000 కోట్లకు కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఇది కోకా-కోలా ఇండియా పూర్తి యాజమాన్యంలోని బాట్లింగ్ అనుబంధ సంస్థ విలువ రూ. 27,000-30,000 కోట్లు. ఈ ఒప్పందంతో సంబంధం ఉన్న వ్యక్తులు ఎకనామిక్స్ టైమ్స్‌తో మాట్లాడుతూ గత వారం రెండు పార్టీల నుండి బిడ్‌లు వేశారని చెప్పారు. మాతృ సంస్థ కోకా-కోలా కంపెనీ ఈ డీల్‌లో ఒకరిద్దరు సహ-ఇన్వెస్టర్లు పాల్గొంటారా లేదా చర్చల తర్వాత పెట్టుబడిదారుల కన్సార్టియం ఏర్పడుతుందా అనేది నిర్ణయిస్తుంది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి ఈ డీల్‌పై తుది నిర్ణయం తీసుకోనున్నట్లు చెబుతున్నారు. కోకా-కోలా హెచ్‌సిసిబిలో పెట్టుబడి పెట్టడానికి భారతీయ వ్యాపార సంస్థలు, బిలియనీర్ ప్రమోటర్ల కుటుంబ కార్యాలయాల బృందాన్ని సంప్రదించింది. ఇది చివరికి దేశీయ మూలధన మార్కెట్ల నుండి ప్రయోజనం పొందేందుకు పబ్లిక్‌ను తీసుకోవాలని కోరుకునే శాఖ. సంప్రదించిన వారిలో పిడిలైట్ ఇండస్ట్రీస్‌కు చెందిన పరేఖ్ కుటుంబ కార్యాలయం, ఏషియన్ పెయింట్స్ ప్రమోటర్ కుటుంబంతో పాటు బర్మన్, భారతియా కూడా ఉన్నారు. కుమార్ మంగళం బిర్లా, సునీల్ భారతి మిట్టల్, టెక్ బిలియనీర్ శివ్ నాడార్ కుటుంబ కార్యాలయాలను కూడా సంప్రదించినట్లు కొందరు భావిస్తున్నారు. అయితే, బర్మన్, భారతియా మాత్రమే వాటా కోసం వేలం వేయడానికి ప్రయత్నించారు.

## స్పోర్ట్స్

# ఆడుతోంది మూడో టెస్ట్.. మూడేళ్ల లోటును పూడ్చేశాడు

తొలి టెస్ట్ లో పాకిస్తాన్ స్వయంకృతాపధం వల్ల ఓడిపోవాల్సి వచ్చింది. అయితే రెండవ టెస్టు లోనూ అదే పరంపర కొనసాగే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ లో పాకిస్తాన్ బౌలర్ షాజాద్ అద్భుతమైన ప్రదర్శన చేశాడు. బంతితో మాయ చేసి బంగ్లా బ్యాటర్లను వచ్చిన వాళ్లను వచ్చినట్టే వెనక్కి పంపించాడు. ఫలితంగా 26 పరుగుల్లోపే బంగ్లాదేశ్ ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో మరో జట్టు గనుక బౌలింగ్ చేసి ఉంటే కచ్చితంగా బంగ్లాదేశ్ 50 పరుగులకే ప్యాకప్ అయ్యేది. కానీ షాజాద్ లాగా మిగతా బౌలర్లు బౌలింగ్ చేయలేకపోవడంతో బంగ్లా జట్టు కోలుకుంది. ఫినిక్స్ పక్షి లాగా కొత్త శక్తిని సంతరించుకొని ఏకంగా పాకిస్తాన్ జట్టుకు సవాల్ విసిరే స్థాయికి ఎదిగింది. రెండవ టెస్ట్ తొలి ఇన్నింగ్స్ లో పాకిస్తాన్ 274 రన్స్ చేసింది. పాకిస్తాన్ కు దీటుగా సమాధానం చెప్పాల్సిన స్థితిలో బంగ్లాదేశ్ కేవలం 26 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. తీవ్రమైన ఇబ్బందుల్లో పడింది. అయితే బంగ్లాదేశ్ ఆస్థాయిలో వికెట్లు కోల్పోవడం వెనక ప్రధాన కారణం పాకిస్తాన్ యువ పేస్ బౌలర్ ఖుర్రం షాజాద్. బంగ్లాదేశ్ జట్టులోని ముగ్గురు కీలక ఆటగాళ్లను అతడు వెనక్కి పంపించాడు.. శాజాద్ అద్భుతమైన బౌలింగ్ వల్ల బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హసన్ శాంటో నాలుగు పరుగులకే ఔట్ అయ్యాడు.. షాద్ మాన్ ఇస్మాల్ పది పరుగులకే పెవిలియన్ చేరుకున్నాడు. షకీబ్ అల్ హసన్ కూడా షాజాద్ చేతికి చిక్కాడు. ఫలితంగా బంగ్లాదేశ్ 26 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఇందులో నాలుగు వికెట్లు షాజాద్ తీసినవే.. మెహదీ ని ఔట్ చేసి ఫైవ్ వికెట్ హాల్ లో చేరుకున్నాడు. షాజాద్ తన కెరియర్లో మూడవ టెస్ట్ మాత్రమే ఆడుతున్నాడు. తస్కిన్ ను వెనక్కి పంపడం ద్వారా తన ఆరు వికెట్ల ఘనతను పూర్తి చేశాడు. గత మూడు సంవత్సరాలుగా ఏ పాకిస్తాన్ పేస్ బౌలర్ కూడా సొంత దేశంలో టెస్ట్ లలో ఐదు వికెట్లు తీయలేదు. ఆ లోటును షాజాద్ భర్తీ చేశాడు. అంతేకాదు మూడు సంవత్సరాలలో ఈ ఘనతను సొంతం చేసుకున్న తొలి పాకిస్తాన్ బౌలర్ గా షాజాద్ అవతరించాడు.. 2021లో ఫిబ్రవరిలో పాకిస్తాన్ దక్షిణాఫ్రికా తో రావల్పిండి వేదికగా టెస్ట్ మ్యాచ్ ఆడింది. ఈ మ్యాచ్ రెండు ఇన్నింగ్స్ లలో షాజాద్ ఐదు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్లో పాకిస్తాన్ విజయం సాధించింది. ఆ తర్వాత ఇంతవరకు మరో టెస్ట్ విజయాన్ని అందుకోలేకపోయింది.





## నా వల్ల కాదు బాబోయ్: సెహ్వాగ్



టీమిండియా హెడ్ కోచ్ పదవిపై తనకు పెద్దగా ఆసక్తి లేదని మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ తెలిపాడు. ఆటగాడిగా ఇప్పటికే 15 ఏళ్ల పాటు ఇంటికి దూరంగా ఉన్నానని, కోచ్ పదవి చేపడితే మరోసారి కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుందన్నాడు. ఐపీఎల్ టీమ్ కోచ్‌గా ఆఫర్ వస్తే మాత్రం వదులుకోనని వీరూ చెప్పాడు. 2017లో టీమిండియా హెడ్ కోచ్ పదవికి సెహ్వాగ్ దరఖాస్తు చేసుకున్నాడు. కానీ అప్పటి సీఏసీ హెడ్ కోచ్‌గా రవిశాస్త్రిని నియమించింది. ఆ తర్వాత వీరూ హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేసుకోలేదు. ఓ ఇంటర్వ్యూ సందర్భంగా టీమిండియా హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తారా? అనే ప్రశ్న వీరేంద్ర సెహ్వాగ్‌కు ఎదురైంది. సెహ్వాగ్ మాట్లాడుతూ%ొ% 'టీమిండియా హెడ్ కోచ్ పదవి చేపట్టను. ఎందుకంటే నేను భారత జట్టుకు కోచ్‌గా మారితే మళ్లీ నా కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. ఇప్పటికే ఆటగాడిగా 15 ఏళ్ల పాటు ఇంటికి దూరమయ్యా. హెడ్ కోచ్ అయితే మరోసారి ఇదే రిపీట్ అవుతుంది. నాకు 14, 16 సంవత్సరాల పిల్లలున్నారు. ఇద్దరూ క్రికెట్ ఆడుతున్నారు. ఒకరు ఆఫ్ స్పిన్నర్, మరొకరు ఓపెనింగ్ బ్యాటర్. వారికి నా అవసరం ఉంది. నేను టీమిండియా హెడ్ కోచ్‌గా వెళ్తే వారిని ట్రైన్ చేయడం కష్టమవుతోంది. ఐపీఎల్‌లో కోచ్ లేదా మెంటార్ ఆఫర్ వస్తే చేస్తాను' అని చెప్పాడు. 15 ఏళ్ల పాటు భారత జట్టుకు ఆడిన వీరేంద్ర సెహ్వాగ్ 2015లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 2014, 2015లో పంజాబ్ కింగ్స్ జట్టుకి ప్రాతినిధ్యం వహించిన వీరూ.. 2016లో అదే జట్టులో కోచింగ్ స్టాఫ్‌లో మెంటార్‌గా చేరాడు. ఆపై డైరెక్టర్ ఆఫ్ ది క్రికెటర్‌గా 2018 వరకు కొనసాగాడు. అప్పటినుంచి వీరూ కోచ్, మెంటార్ పదవికి దూరంగా ఉంటున్నాడు. భారత్ తరఫున సెహ్వాగ్ 104 టెస్టులు, 251 వన్డేలు, 19 టీ20లు ఆడాడు.

## సైనా నెహ్వాల్ సంచలన వ్యాఖ్యలు




సైనా నెహ్వాల్ కు ప్రస్తుతం 34 సంవత్సరాలు. ఆమె తన సహచర బ్యాడ్మింటన్ ఆటగాడు పారుపల్లి కశ్యప్ ను డిసెంబర్ 16, 2018 న వివాహం చేసుకుంది. పెళ్లి జరిగిన తర్వాత కూడా బ్యాడ్మింటన్ కొనసాగించింది. ఈలోగా సింధు వెలుగులోకి రావడంతో సైనా ఫేడ్ ఔట్ అయిపోయింది. ఈ దశలోనే ఆమెను కొన్ని వివాదాలు చుట్టుముట్టాయి. దీంతో ఆమె కోచ్ ను మార్చుకుంది. వేరే కోచ్ ఆధ్వర్యంలో ట్రైనింగ్ తీసుకుంది. కొద్దిరోజులు బెంగళూరులో ఉంది. ఇక ఇటీవల టీం ఇండియా స్టార్ బౌలర్ బుమ్రా పై సంచలన వ్యాఖ్యలు చేసింది..నేను షాట్లు సంధిస్తే బుమ్రా తట్టుకోగలడా అంటూ వ్యాఖ్యానించింది. ఆమె చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. ఇది ఇలా ఉండగానే సైనా నెహ్వాల్ సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేసింది. ఈ ఏడాది చివర్లో తాను ఆటకు స్వస్తి పలుకుతానని ప్రకటించింది. దీంతో ఒక్కసారిగా అభిమానులు షాక్ కు గురయ్యారు. " నేను చాలా రోజులుగా ఆర్థరైటిస్ తో బాధపడుతున్నాను. అందువల్లే ఆటకు వీడ్కోలు పండగ తప్పడం లేదని" సైనా నెహ్వాల్ వ్యాఖ్యానించింది. ఒలింపిక్ చరిత్రలో బ్యాడ్మింటన్లో భారతదేశానికి తొలి మెడల్ అందించిన ఘనత సైనా నెహ్వాల్ ది. 2012లో లండన్ లో జరిగిన ఒలింపిక్స్ లో ఆమె కాంస్యం దక్కించుకుంది. గతంలోనూ ఆమె వరల్డ్ నెంబర్వన్ ర్యాంకర్ గా కొనసాగింది. కామన్వెల్త్ 2010, 18 సీజన్లలో గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకుంది. కొంతకాలంగా ఆమె టోర్నీలకు దూరంగా ఉంటున్నది. గాయాల వల్లే ఆమె విరామం తీసుకుంది. సైనా నెహ్వాల్ ప్రస్తుతం తీవ్రమైన మోకాలి నొప్పితో బాధపడుతోంది. ఆర్థరైటిస్ కూడా ఆమెను ఇబ్బంది పెడుతోంది. ఇలాంటి స్థితిలో ఆమె రోజుకు 8 నుంచి 9 గంటలపాటు ప్రాక్టీస్ చేయడం అంత సులభం కాదు. అందువల్లే ఆటకు వీడ్కోలు పలికేందుకు సిద్ధమైంది.



# అనుష్క షాకింగ్ పోస్ట్!

కేరళ సినీ ఇండస్ట్రీలో జస్టిస్ హేమా కమిటీ నివేదిక తర్వాత విస్తుపోయే నిజాలు వెలుగులోకి రావడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ముఖ్యంగా ఒక్కో సినీ ఇండస్ట్రీలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న నటీమణులు, ఈ నివేదిక బయటకు వచ్చిన తర్వాత మీడియా ముందుకు వస్తున్నారు.ఇకపోతే ఇప్పటివరకు బాలీవుడ్, కోలీవుడ్ , మాలీవుడ్ ఇండస్ట్రీలలో క్యాస్టింగ్ కౌచ్ ఎక్కువగా ఉంది అంటూ వార్తలు రాగా.. ఇప్పుడు టాలీవుడ్ లో కూడా జస్టిస్ హేమ కమిటీ లాంటి నివేదిక వేయాలి అని స్టార్ హీరోయిన్ సమంత ఒక పోస్ట్ పెట్టడంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీనికి తోడు మరొకసారి హీరోయిన్అనుష్క శెట్టి కూడా టాలీవుడ్ లో కూడా క్యాస్టింగ్ కౌచ్ ఉందని , ఇక్కడ కూడా కమిటీ వెయ్యాలి అని కోరడంతో , ఇక నిజంగానే ఇక్కడ క్యాస్టింగ్ కౌచ్ ఉందా అంటూ అప్పుడే అభిమానులు ఆరా తీయడం మొదలు పెట్టారు. టాలీవుడ్ సినీ ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ ఉంది అంటూ అందుకు నివేదిక కూడా వేయాలి అని తెలంగాణ ప్రభుత్వాన్ని స్టార్ హీరోయిన్ సమంత కోరగా, ఇప్పుడు ఇదే విషయంపై అనుష్క స్పందిస్తూ.. టాలీవుడ్ లో క్యాస్టింగ్ కౌచ్ ఉంది. ముఖ్యంగా ఆడవారిపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయి. తెలుగు ఫిలిం ఇండస్ట్రీలో మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని కలిగించాలి. ఇందుకోసం మీరు హేమా కమిటీ లాంటి ఒక నివేదికను ఇక్కడ కూడా వేయాలి అంటూ అనుష్క పోస్ట్ పెట్టింది. ఇక ఇలా సమంత, అనుష్క ఇద్దరు స్టార్ హీరోయిన్లు ఇలాంటి కామెంట్లు చేయడంతో టాలీవుడ్ లో కూడా లైంగిక వేధింపులు ఎక్కువయ్యాయి అంటూ సినీ ప్రేక్షకులు కామెంట్లు చేస్తున్నారు.



# కేక పుట్టించిన కలెక్షన్స్.. సక్సెస్ పార్టీ కి 'ఆయ్' టీమ్ రెడీ..

ఎన్నో సక్సెస్‌ఫుల్ చిత్రాలను అందించిన ప్రతిష్టాత్మక సంస్థ GA2 పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందిన చిత్రం 'ఆయ్'. ఎనర్జిటిక్ హీరో నార్నే నితిన్, నయన్ సారిక జంటగా నటించారు. అంజి కె.మణిపుత్ర ఈ చిత్రంతో దర్శకుడిగా బాధ్యతలను నిర్వహించారు. టాలెంటెడ్ యంగ్ ప్రొడ్యూసర్స్ బన్నీ, విద్యా కొప్పినీడి ఈ ఫన్ ఎంటర్‌టైనర్‌ను నిర్మించారు.ఆగస్టు 15న మిస్టర్ బచ్చన్, డబుల్ ఇస్మార్ట్, తంగలాన్ వంటి మూడు భారీ సినిమాల మధ్య చిన్న సినిమాగా విడుదలైన ఆయ్ సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఎటువంటి హంగామా లేకుండా వచ్చిన ఈ సినిమా మౌత్ టాక్ తో ప్రేక్షకులను థియేటర్ కు రప్పించగలిగింది. జూనియర్ ఎన్టీయార్ బావమరిది నార్నె నితిన్ హీరోగా గీతా ఆర్ట్స్ -2 బ్యానర్ పై వచ్చింది ఆయ్. ఆగస్టు 15న పెద్ద సినిమాలతో పోటీగా ఎందుకు కాస్త గ్యాప్ ఇచ్చి రిలీజ్ చేయమని అప్పట్లో నిర్మాతకు కొందరు సూచించారు. కానీ అప్పటికే మరో చిన్న సినిమా అయిన కమిటీ కుర్రోళ్లు మంచి హిట్ సాధించడంతో కంటెంట్ బాగుంటే తప్పక ఆదరిస్తారని నిర్మాతలు ధైర్యంగా ముందడుగు వేశారు దొరికినన్ని థియేటర్లలో విడుదల చేసారు. కథ, కథనం బాగుంటే చిన్న సినిమాలను టాలీవుడ్ ఆడియన్స్ ఆదరిస్తారని నమ్మి విడుదల చేయగా నిర్మాతల నమ్మకం నిజమైంది. విడుదలైన 16 రోజులకు గాను 16. 40 కోట్ల రూపాయల కలెక్షన్స్ రాబట్టి నిర్మాత బన్నీ వాసుకు లాభాల పంట పండించింది. విజయవంతంగా మూడవ వారంలో అడుగుపెట్టి డీసెంట్ కలెక్షన్స్ రాబడుతోంది. కాగా ఆయ కలెక్షన్స్ లో 25% డబ్బును ఏపీ వరద భాదితుల సహాయార్థం జనసేన పార్టీ ద్వారా అందిస్తామని బన్నీ వాసు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# చాన్నాళ్లకు సోనమ్ నుంచి సినిమా




త్వరలో ఓ భారీ ప్రాజెక్టుతో మీ ముందుకు రాబోతున్నానంటోంది బాలీవుడ్ కథానాయిక సోనమ్ కపూర్. 'దిల్లీ-6', 'నీర్జా', 'ప్రేమ్ రతన్ ధన్ పాయో' లాంటి ఎన్నో విజయవంతమైన చిత్రాలతో సినీప్రియులను అలరించిందీమె. రెండేళ్లుగా సినిమాల నుంచి విరామం తీసుకున్న ఈ భామ.. గతేడాది 'బ్లైండ్' అనే చిత్రంతో ప్రేక్షకులను పలకరించింది. ఇప్పుడు మరో కొత్త ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపినట్లు తెలిపింది సోనమ్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె..తన రాబోయే సినిమా విశేషాలను పంచుకుంది. "ప్రసవానంతరం చాలా రోజుల తర్వాత కెమెరా ముందుకు వస్తున్నందుకు ఉత్సాహంగా ఉంది. నాకు నటిగా ఉండడమంటే చాలా ఇష్టం. ఈ రంగంలోనే ఎన్నో విభిన్నమైన పాత్రలతో, కథలతో అభిమానుల ప్రేమను సొంతం చేసుకునే అవకాశం ఉంటుంది.కొత్త కొత్త పాత్రలతో ప్రయోగాలు చేయడమంటే ఎక్కువ ఆసక్తి. వచ్చే ఏడాది ఓ ప్రాజెక్టుతో మీ ముందుకు రాబోతున్నాను. ఇప్పుడే దీని గురించి పూర్తిగా చెప్పలేను. కానీ.. ఇది నా కెరీర్‌లోనే ఓ భారీ చిత్రంగా ఉండబోతుంది. త్వరలో పూర్తి విషయాల్ని అధికారికంగా ప్రకటిస్తాం" అని చెప్పింది సోనమ్.

# ఎన్టీఆర్ భారీ విరాళం..



జూనియర్ ఎన్టీఆర్ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో ముందుంటారు అని చాలామంది ఆయన అభిమానులు చెబుతూ ఉంటారు.ఎందుకంటే ఎవరికి ఏ కష్టం వచ్చినా చాలు ఎన్టీఆర్ చెవిన ఆ విషయం పడితే ఆలోచించడం ఉండదు నెక్స్ట్ మినిట్లో వారికి సహాయం అందడమే.ఇప్పటికే ఎంతోమందికి రహస్య దానాలు చేస్తున్న ఎన్టీఆర్ తాజాగా కోటి రూపాయల భారీ విరాళం ప్రకటించి రెండు తెలుగు రాష్ట్రాల అభిమానుల మన్ననలు పొందుతున్నారు. ఇక విషయంలోకి వెళ్తే.. ప్రస్తుతం తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్లలో భారీ వర్షాల కారణంగా ఎంతోమంది ప్రజలు జనజీవనాన్ని కోల్పోయారు.లక్షలాదిమంది ఇండ్లు వరదల్లో మునిగిపోయాయి. ఎంతోమంది తినడానికి తిండి లేక ఎవరు ఆహారం అందిస్తారా అని బిక్కు బిక్కుమంటూ ఆకాశం వైపు ఎదురుచూస్తూ ఉన్నారు. కనీసం నీళ్లు తాగడానికి కూడా లేదు లాలాజలం మిగుకుంటూ తమ పరిస్థితిని వెల్లదీసుకుంటున్నారు. అయితే అలాంటి దుస్థితి ఇప్పటికీ ఎంతో మంది ఎదుర్కొంటున్నారు. ఇక దీంతో చాలామంది సినీ రాజకీయ సెలబ్రిటీలు,వ్యాపారవేత్తలు తమకు తోచిన సహాయం చేస్తున్నారు. అయితే ఇప్పటికే పలువురు బిజినెస్ మ్యాన్లు, రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు రెండు తెలుగు రాష్ట్రాలకు భారీ విరాళాలు సీఎం సహాయక నిధికి అందజేస్తున్నారు. ఇందులో భాగంగా జూనియర్ఎన్టీఆర్ సైతం తన వంతుగా కోటి రూపాయల భారీ విరాళాన్ని రెండు తెలుగు రాష్ట్రాల వరద బాధితులకు విరాళంగా ఇస్తున్నట్టు ఎన్టీఆర్ చెప్పుకొచ్చారు.రెండు తెలుగు రాష్ట్రాల్లో వర్షం కారణంగా వచ్చిన వరదల్లో ఇరుక్కున్న ప్రజలను చూస్తే నా హృదయం ఎంతగానో కలిచివేస్తుంది. వర్షం కారణంగా వచ్చిన వరద బీభత్సం చూసి నేను ఎంతగానో చలించి పోయాను. అందుకే నా వంతుగా రెండు తెలుగు రాష్ట్రాలకు చేరో 50 లక్షల విరాళం అందిస్తున్నాను అంటూ ఎన్టీఆర్ చెప్పుకొచ్చారు. అలాగే ఈ విపత్తు నుండి తొందరగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు బయటపడాలని ఆ దేవుడిని కోరుకుంటున్నట్టు ఎన్టీఆర్ పోస్ట్ పెట్టారు. ప్రస్తుతం ఎన్టీఆర్ మంచి మనసుకు ఎంతోమంది అభిమానులు ఆయన్ని పొగుడుతున్నారు.

# ఓజీ కోసం రంగంలోకి మరో స్టార్ హీరో



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న సినిమా ఓజి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ముంబై బ్యాక్ డ్రాప్‌లో గ్యాంగ్ స్టర్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాను.. యంగ్ డైరెక్టర్ సుజీత్ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ అయిన హంగ్రీ చీతా గ్లింప్స్ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పించగా ఒక డై హార్డ్ ఫ్యాన్ పవన్‌ను డైరెక్ట్ చేస్తే ఎలా ఉంటుందో.. ఓజితో చూపించబోతున్నాడు సుజీత్. ఇప్పటికే ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకోగా పవన్ ఒక్కసారి డేట్స్ ఇస్తే చాలు.. షూటింగ్ మొత్తం పూర్తవుతుందని మేకర్స్ ధీమాగా ఉన్నారు. పవన్ కూడా మిగతా సినిమాల కంటే ముందుగా ఓజి సినిమాను కంప్లీట్ చేయడానికి రెడీ అవుతున్నారు. ఈ నేపథ్యంలో ఓజి సినిమా గురించి ఒక ఆసక్తికరమైన వార్త వెలుగులోకి వచ్చింది. అదేమంటే ఈ సినిమాలో ఒక సాంగ్ కోసం తమిళ స్టార్ శింబును సంప్రదించారు మేకర్స్. దీంతో ఆయన వెంటనే పాడతానని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇక వాస్తవానికైతే.. ఈ సెప్టెంబర్ 27న ఓజి థియేటర్లోకి రావాల్సి ఉంది. కానీ పవన్ రాజకీయంగా బిజీ అవ్వడంతో.. ఓజిని వాయిదా వేశారు. ఓజి ప్లేస్‌లో ఎన్టీఆర్ దేవర రిలీజ్ అవుతోంది. మరి ఓజి రిలీజ్ ఎప్పుడు అంటే? వచ్చే ఏడాదిలో ఉంటుందని అంతా ఫిక్స్ అయ్యారు. లేటెస్ట్ అప్డేట్ ప్రకారం.. 2025 సమ్మర్ కానుకగా మార్చ్ 27న ఓజి రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నట్టు సినిమా యూనిట్ క్లారిటీ ఇచ్చేసింది. లాంగ్ వీకెండ్ కలిసొచ్చేలా ఇదే డేట్‌ను మేకర్స్ లాక్ చేసినట్టుగా తెలుస్తోంది. ఈ క్రమంలో ఓజీ రాక కోసం మరో 7 నెలలు వెయిట్ చేయాల్సిందే.

PMR Publication,Thurkayamjal 4-136/12, 9100900918